జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967

కృష్ణ | సోమవారం 5 అక్టోబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :262 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



## ఏపీ ప్రజల అన్ని ఆశలు నెరవేర్చడం చంద్రబాబు ద్వారానే సాధ్యం

- బుర్రిపాలెంలో శివరాజ్ సింగ్ చౌహాన్
- తెనాలి నియోజకవర్గం బుర్రిపాలెంలో కార్యక్రమం
- 3 లక్షల ఇళ్లకు శంకుస్థాపన
- హాజరైన కేంద్రమంత్రి శివరాజ్ సింగ్, సీఎం చంద్రబాబు
- సీఎం చంద్రబాబు కోరిక మేరకు మరిన్ని ఇళ్లు ఇస్తామని శివరాజ్ సింగ్ హామీ
- జగన్ పాలనలో ఏపీ నాశనమైందని, పేదల ఇళ్లను అడ్డుకున్నారని విమర్శ
- చంద్రబాబు విజన్‌తో ఏపీ దేశంలోనే నంబర్ వన్ అవుతుందని ఉద్ఘాటన

# 3డీ ప్రింటింగ్‌తో పేదల ఇళ్లు



- చంద్రబాబు సర్కారు వినూత్న ముందడుగు
- రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం
- మరో 6 లక్షల ఇళ్ల మంజూరుకు కేంద్రమంత్రి హామీ
- బుర్రిపాలెంలో 3డీ ప్రింటింగ్ టెక్నాలజీతో పైలట్ ప్రాజెక్టు
- 2029 నాటికి పేదలందరికీ ఇళ్లు నిర్మిస్తామన్న సీఎం చంద్రబాబు
- ఏపీ గృహ నిర్మాణం దేశానికే రోల్ మోడల్ అన్న శివరాజ్‌సింగ్ చౌహాన్

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ రంగంలో సరికొత్త అధ్యాయం మొదలైంది. అత్యాధునిక 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో వేగంగా, పటిష్టంగా, తక్కువ ఖర్చుతో ఇళ్లను నిర్మించే బృహత్తర కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2029 నాటికి రాష్ట్రంలో ఇల్లు లేని పేదలు ఉండకూడదనే లక్ష్యంతో, ఏకంగా 9 లక్షల ఇళ్లను నిర్మించి పేదలకు పట్టాభిషేకం చేయాలని సంకల్పించింది. ఈ మహాయజ్ఞంలో భాగంగా గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ గృహ నిర్మాణ యజ్ఞంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ. దేశంలోనే తొలిసారిగా భారీ ఎత్తున ఈ సాంకేతికతను వినియోగిస్తున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, రూర్కీలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీబీఆర్ఐ) సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం బుర్రిపాలెంలో రూ.14 కోట్ల వ్యయంతో 177 ఇళ్లను పైలట్ ప్రాజెక్టుగా నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టును సందర్శించిన సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి చౌహాన్‌లకు అధికారులు - మిగతా3లో



## రేవంత్ రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు

- కుప్పంకు నీళ్లిస్తూ పాలమూరు రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ
- రాష్ట్రంలో కరవు మండలాలను తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్
- రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ హామీ ఏమైందని సూటి ప్రశ్న
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులని విమర్శలు



## శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు..

- శిలాతోరణం వరకు బారులు తీరిన క్యూలైన్లు
- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల అధిక రద్దీ
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నిండి శిలాతోరణం వరకు చేరిన క్యూలైన్లు
- సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతుందని అంచనా
- శనివారం శ్రీవారిని 91,296 మంది దర్శించుకోగా, హుండీ ద్వారా రూ.5.06 కోట్ల ఆదాయం

## ఏపీలో 'తల్లికి వందనం'.. రెండో విడతకు రంగం సిద్ధం

- సుమారు 3.29 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.13,000 జమ
- ఇప్పటికే ఆర్థిక శాఖ ఆమోదం.. సీఎంవో అనుమతి కోసం నిరీక్షణ
- వచ్చే వారం లేదా రెండు వారాల్లో నిధులు విడుదలయ్యే అవకాశం




**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో 'తల్లికి వందనం' పథకం రెండో విడత నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలపగా, ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి తుది అనుమతి రావడమే మిగిలి ఉంది. సీఎంవో నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే నిధులను విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విడతలో భాగంగా అర్హులైన సుమారు 3.29 లక్షల మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ. 13,000 చొప్పున ప్రభుత్వం జమ చేయనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులు, ఇంటర్మీడియట్ మొదటి - మిగతా3లో



## 'అమరజీవి జలధార' (జల్ జీవన్ మిషన్) పథకానికి శ్రీకారం

- కడప జిల్లాలో చంద్రబాబు, పవన్ పర్యటన
- రూ.30,156 కోట్ల వ్యయంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా
- రాష్ట్రవ్యాప్తంగా 27.36 లక్షల కొత్త కుళాయి కనెక్షన్లు ఇవ్వడమే లక్ష్యం
- ప్రొద్దుటూరులో పథకం ప్రారంభించి, బహిరంగ సభలో ప్రసంగించనున్న నేతలు

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న 'అమరజీవి జలధార' (జల్ జీవన్ మిషన్) పథకానికి సోమవారం శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రేపు (అక్టోబరు 5) కడప జిల్లాలోని ప్రొద్దుటూరులో పర్యటించనున్నారు. వీరిద్దరూ కలిసి ఈ భారీ తాగునీటి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి, - మిగతా3లో



## ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా దాడి.. ఒకరి మృతి

- ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా డ్రోన్ల దాడి
- సుమీ నగరంలోని కుసుమ్ గ్రూప్ ప్లాంట్ దాదాపు ధ్వంసం
- దాడిలో ఒకరు మృతి, పలువురికి తీవ్ర గాయాలు
- దాదాపు రూ.400 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా

# తెర్నేకల్‌కు అభివృద్ధి వరాలు..

రూ.7 కోట్ల పనులకు శ్రీకారం! తాగునీరు, రోడ్లు, ఆసుపత్రిపై ప్రత్యేక దృష్టి

తెర్నేకల్ అభివృద్ధికి రాజీలేని కృషి

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..

చిల్లర రాజకీయాలకు తావులేదు:

జనసేన ఆలూరు ఇన్‌చార్జి తెర్నేకల్ వెంకప్ప



**హోళగుంద, అక్టోబర్ 4, ప్రజా జ్యోతి న్యూస్ –** తెర్నేకల్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు మరింత కృషి చేస్తామని జనసేన పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తెర్నేకల్ వెంకప్ప అన్నారు. గ్రామంలో దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న కాలనీలకు నీటి సరఫరా కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని, ఇంకా మిగిలిన చిన్నచిన్న సమస్యలను కూడా దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు.ఐతెర్నేకల్ గ్రామంలో గతంలో నిర్మించిన వాటర్ ట్యాంకులు, డ్రైనేజీ వ్యవస్థలను పరిశుభ్రంగా నిర్వహించుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనా ఉందన్నారు. ప్రతి కాలనీకి సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు కొనసాగిస్తామని చెప్పారు. "నాయకులు వస్తే పూలదండలు వేయడం మాత్రమే కాదు.... ఏ ప్రభుత్వం వస్తే గ్రామానికి ఏం అభివృద్ధి జరుగుతుంది? ప్రజలకు ఏం ప్రయోజనం కలుగుతుంది? అనే విషయాలపై చర్చ జరగాలి" అని వెంకప్ప పేర్కొన్నారు.

గ్రామ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రస్తావిస్తూ.. సీసీ రోడ్ల నిర్మాణానికి సుమారు రూ.1 కోటి,ఆసుపత్రి అభివృద్ధికి రూ.2 కోట్లు,తెర్నేకల్--పుల్లాపురం రహదారి అభివృద్ధికి భారీగా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామం, పరిసర ప్రాంతాలను కలుపుకుని దాదాపు రూ.7 కోట్ల మేర అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు.

**నీటి వనరులను కాపాడుకోవాలి**

తాగునీటి సమస్యపై స్పందిస్తూ.. ఇసుక అక్రమ తవ్వకాల వల్ల నీటి వనరులు దెబ్బతింటున్నాయన్న ప్రజల ఆందోళనలను వెంకప్ప ప్రస్తావించారు. వేలాది మంది ప్రజలు నివసించే గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తడం ఆలోచించాల్సిన విషయమన్నారు. ప్రజా వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అక్రమాలను ప్రశ్నించేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.తెర్నేకల్ గ్రామ ప్రజలు తనపై నమ్మకం ఉంచి అండగా నిలిస్తే.. గ్రామ అభివృద్ధి కోసం మరింత బాధ్యతతో పనిచేస్తానని వెంకప్ప తెలిపారు. అవసరమైతే టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతితో కలిసి గ్రామంలో వీధివీధికి వెళ్లి ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు."చిల్లర రాజకీయాలు కాదు.. ప్రజా సమస్యలపై చర్చించాలి. అభివృద్ధి కోసం కలిసి నడవాలి. తెర్నేకల్ గ్రామ అభివృద్ధే మనందరి లక్ష్యం"

**అని జనసేన ఆలూరు ఇంచార్జ్ వెంకప్ప స్పష్టం చేశారు.**

తెర్నేకల్ గ్రామం నుంచే ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి మరింత బలమైన అడుగు పడాలని, రాబోయే ఎన్నికల్లో ఎన్ డి ఎ కూటమి విజయానికి తెర్నేకల్ ప్రజలు కీలకంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలూరు టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి,కూటమి నాయకులు, కార్యకర్తలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎల్లార్తి గ్రామ అభివృద్ధికి బాటలు

– రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఘనంగా భూమి పూజ

ఆలూరు టిడిపి ఇంచార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి,శివప్రసాద్ చొరవతో అభివృద్ధి పరుగులు



**హొళగుంద,అక్టోబర్ 04, ప్రజా జ్యోతి న్యూస్ –** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు సారథ్యంలో, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దార్శనికతతో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని, అందులో భాగంగా ఆలూరు టిడిపి ఇంచార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి చొరవతో హొళగుంద మండలం ఎల్లార్తి గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందని టిడిపి నాయకులు మల్లికార్జున,చిదానంద, తదితరులు పేర్కొన్నారు.ఎల్లార్తి గ్రామ ఎస్సీ కాలనీలో రూ.10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు అంగరంగ వైభవంగా భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎస్సీ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో కాలనీ వాసుల్లో హర్షం వ్యక్తమవుతోందన్నారు.వర్షాకాలంలో బురదమయంగా మారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పుడు సీసీ రోడ్లు మంజూరు చేయించిన వైకుంఠం జ్యోతి, శివప్రసాద్ లకు కాలనీ వాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని,గత ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ప్రతి పల్లెలో, ప్రతి కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు బోయ మల్లికార్జున, టీడీపీ నాయకులు మాల రామప్ప, టీడీపీ యువ నాయకుడు ఎల్లార్తి చిదానంద,వీరేష్,ఎంకోబా, పెద్ద ముకప్ప, దాసుల వెంకటేష్, శేషగిరి, నరసింహులు, రసమన్న, ఎల్లప్ప, హరిజన నాగరాజ్, దుర్గప్ప,టీడీపీ యువ నాయకులు శశికాంత్, చంద్ర, తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు

## గ్రామాల అభివృద్దే కూటమి ప్రభుత్వ ధ్యేయం

సులువాయి గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



**హొళగుంద, అక్టోబర్ 04, ప్రజా జ్యోతి న్యూస్ –** హొళగుంద మండలం సులువాయి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలూరు టీడీపీ ఇన్‌చార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు గ్రామంలోని ఊరు బావి నుంచి బస్టాండ్ వరకు రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. గ్రామంలో రహదారి సౌకర్యం మెరుగుపడటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగనున్నాయని, ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గనున్నాయని గ్రామస్థులు తెలిపారు. అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తూ గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్న టీడీపీ ఇన్చార్ శ్రీమతి వైకుంఠం జ్యోతి నాయకత్వానికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు,రాఘవేంద్ర చౌదరి, పాఠశాల కమిటీ చైర్మన్ ఉల్లిగడ్డ శరణబసప్ప, బసవరాజు,చంద్రగిరి,మహేష్ గౌడ్, నాగరాజు తిమ్మప్ప కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పెద్దహ్యాటలో ప్రగతి పరుగు

రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఘనంగా భూమి పూజ

చంద్రబాబు నాయుడి పాలనలో ప్రగతి పథంలో పల్లెలు

వైకుంఠం జ్యోతి, వైకుంఠం శివప్రసాద్ చొరవతో మంజూరైన రహదారి పనులు

ఏళ్లుగా వేధిస్తున్న రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం



**హోళగుంద, అక్టోబర్ 4, ప్రజా జ్యోతి న్యూస్ –** హోళగుంద మండలం పెద్దహ్యాట గ్రామంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి.ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్, వైకుంఠం జ్యోతి,వైకుంఠం శివప్రసాద్ ప్రత్యేక చొరవ, సహకారంతో పెద్దహ్యాట గ్రామంలో రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం అంగరంగ వైభవంగా భూమి పూజ నిర్వహించారు. గ్రామంలోని ఎంపీపీ స్కూల్ నుండి కట్టే శేకయ్య ఇంటి వరకు ఈ సీసీ రోడ్డును నిర్మించనున్నారు.ఎన్నో ఏళ్లుగా బిసి కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి వర్షాకాలంలో రోడ్డంతా బురదమయంగా మారి తీవ్ర ఇబ్బందులు పడేవారమని, తమ సమస్యను గుర్తించి వెంటనే సీసీ రోడ్డు మంజూరు చేయించిన వైకుంఠం జ్యోతి, వైకుంఠం శివప్రసాద్‌లకు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... "గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ముఖ్య ధ్యేయం అని గత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందనీ విమర్శించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి పల్లెలో, ప్రతి కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రాచయ్య స్వామి, క్లస్టర్ ఇన్ఛార్జ్ వీరేంద్ర,యువ నాయకులు వీరభద్రప్ప, బి.కె. వీరేష్, రాము, కె. మల్లయ్య, బీజేపీ నాయకుడు శివాబసవ, టీడీపీ నాయకుడు శ్రీకాంత్ తో పాటు గ్రామ పెద్దలు, నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కబడ్డీలో శ్రీ సాయి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ -- జిల్లా జట్లకు 8 మంది ఎంపిక





**రాయచోటి అక్టోబర్ 04 ప్రజా జ్యోతి** శ్రీ సాయి కాన్సెప్ట్ స్కూల్, మాసాపేట, రాయచోటి విద్యార్థులు కబడ్డీ క్రీడలో సత్తా చాటి అన్నమయ్య జిల్లా జట్లకు ఎంపికై పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. అన్నమయ్య జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికల్లో సబ్–జూనియర్ జట్టుకు యస్ అఫీన్, కె. రెడ్డి ప్రసన్న, కె.మహా, యం.నిహారిక, వి.లీనా అల్ఫియా, జూనియర్ జట్టుకు యస్.అఫ్షీన్, జి. హస్నా నుస్రత్ ఎంపిక కాగా, యస్ జి యు–19 జిల్లా జట్టుకు కె.రెడ్డి ప్రసన్నఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో అన్నమయ్య జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థుల ప్రతిభపై పాఠశాల చైర్మన్ కె వి పి సుబ్బయ్య ఏవో రాయుడు, ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు, పాఠశాలకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.శ్రీ సాయి కాన్సెప్ట్ స్కూల్‌లో చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. విద్యార్థుల సమగ్ర వికాసానికి విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమని, క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, పట్టుదల మరియు శారీరక దారుఢ్యం పెంపొందుతాయని తెలిపారు. "మా లక్ష్యం మంచి మార్కులు సాధించే విద్యార్థులను మాత్రమే కాకుండా, విద్య, క్రీడలు మరియు వ్యక్తిత్వ వికాసంలో రాణించే సంపూర్ణ వ్యక్తిత్వం కలిగిన విద్యార్థులను తీర్చిదిద్దడం" అని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

## చెముడులంక నాలుగు వీధుల జంక్షన్‌లో ఘనంగా మహా అన్న సమారాధన.



**ఆలమూరు,అక్టోబర్ 4(ప్రజాజ్యోతి):**ఆలమూరు మండలం చెముడులంక గ్రామంలోని నాలుగు వీధుల జంక్షన్‌లో కొలువైన కాణిపాక వరసిద్ధి వినాయకుని గణపతి నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం మహా అన్న సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజల సహకారంతో, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్న సమారాధనకు భక్తులు, గ్రామ ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. సుమారు 6,000 మందికి పైగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్నదాన కార్యక్రమానికి విరాళాలు అందించిన దాతలకు, భక్తులకు, గ్రామ ప్రజలకు, కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే అన్నప్రసాదం వడ్డనలో సేవలందించిన సేవా కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో వైఎస్సార్సీపీ మండల కన్వీనర్, చెముడులంక మాజీ సర్పంచ్ తమ్మన శ్రీనివాసు, వైఎస్సార్సీపీ కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్దే కూటమి ధ్యేయం

హెబ్బటంలో పండగలా 'పల్లె పండుగ 3.0'

రూ. 30 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు భూమిపూజ



**హొళగుంద, అక్టోబర్ 04 ప్రజా జ్యోతి న్యూస్ –** రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'పల్లె పండగ 3.0' కార్యక్రమంలో భాగంగా హొళగుంద మండలం హెబ్బటం గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందని టిడిపి నాయకులు పేర్కొన్నారు.ఆలూరు టిడిపి ఇంచార్జి శ్రీమతి వైకుంఠం జ్యోతి, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకుంఠం శివప్రసాద్ ఆదేశాల మేరకు, హొళగుంద మండల సింగిల్ విండో చైర్మన్ శ్రీ విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో రూ. 30 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, మురుగునీటి డ్రైనేజీ నిర్మాణ పనులకు నాయకులు శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు.

**గ్రామీణ వికాసమే కూటమి ప్రభుత్వ ధ్యేయం**

ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు మరియు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. మంజూరైన పనులను నాణ్యతా ప్రమాణాలతో, వీలైనంత వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కురువ గోపాల్, క్లస్టర్–01 ఇంచార్జ్ మల్లికార్జున, యూనిట్ ఇంచార్జ్ సవారప్ప, బూత్ కన్వీనర్లు శేక్షవాలి, మీసేవ శీను, కో–కన్వీనర్లు రవి, శ్రీకాంత్, గ్రామ కమిటీ నాయకులు నాగయ్య, శేఖర్, మాణిక్య, పిన్నే కృష్ణ, బీజేపీ నాయకుడు కాళప్ప, పక్కిరప్ప తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఏపీ ప్రజల అన్ని ఆశలు నెరవేర్చడం

# చంద్రబాబు ద్వారానే సాధ్యం

ఆంధ్రప్రదేశ్ ప్రజల సమస్త ఆకాంక్షలు నెరవేర్చగల సత్తా ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాత్రమే ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. చంద్రబాబు ఒక డైనమిక్, డెడికేటెడ్, డెసిసివ్ నాయకుడని, ఆయన విజన్‌కు తాను సెల్యూట్ చేస్తున్నానని కొనియాడారు. తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో జరిగిన 3 లక్షల ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా అవతరించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధికి, ప్రజల కలలను సాకారం చేయడానికి చంద్రబాబు నాయకత్వం అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు.

**టెక్నాలజీతో రాష్ట్రాభివృద్ధికి బాటలు**

భవిష్యత్తులో దేశానికి అతిపెద్ద శక్తి టెక్నాలజీయేనని చంద్రబాబు ఎప్పుడో గుర్తించారని శివరాజ్ సింగ్ గుర్తుచేశారు. "ఆయన దూరదృష్టితోనే ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రాన్ని గ్లోబల్ ఐటీ హబ్‌గా ప్రపంచానికి పరిచయం చేశారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో ఏఐ, డేటా సెంటర్లు, క్వాంటం టెక్నాలజీ, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి రంగాల్లో ఏపీలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నారు. అమరావతి అభివృద్ధిపై ఆయన విజన్ చూసి నేను ఆశ్చర్యపోయాను. ఆయన నిబద్ధత, కఠోర శ్రమతో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఐకాన్‌గా నిలుస్తుంది" అని చౌహాన్ పేర్కొన్నారు.

**జగన్ పాలనలో సర్వనాశనం**

గత ఐదేళ్లలో జగన్ తన విధ్వంసకర వైఖరితో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని చౌహాన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. "ప్రధాని నరేంద్ర మోదీ పేదల ఇళ్ల కోసం నిధులు పంపితే, జగన్ ప్రభుత్వం తన వాటా ఇవ్వకుండా ఆ పథకాన్ని నీరుగార్చింది. పేదల సొంతింటి కలను చిదిమేసింది. కేంద్రం పంపిన నిధులను దారి మళ్లించి పాపం చేసింది. జగన్‌ను ఏపీ ప్రజలు ఎప్పటికీ క్షమించరు" అని ఆయన మండిపడ్డారు. గత ప్రభుత్వం సరిగ్గా పనిచేసి ఉంటే, ఈపాటికే పేదలందరికీ ఇళ్లు ఉండేవని అన్నారు. కాంగ్రెస్ రాష్ట్రాన్ని రాజధాని లేకుండా వదిలేస్తే, జగన్ మూడు రాజధానుల ఆటతో గందరగోళం సృష్టించారని దుయ్యబట్టారు.

**పేదలందరికీ పక్కా ఇళ్లు.. కేంద్రం భరోసా**

చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక పేదలందరికీ ఇళ్లు కట్టించాలని సంకల్పించారని శివరాజ్ సింగ్ తెలిపారు. "కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రాష్ట్రానికి 76,000 ఇళ్లు మాత్రమే వస్తాయని అధికారులు చెప్పారు. కానీ చంద్రబాబు గారు అందరికీ ఇళ్లు కావాలని, ఇంకా ఎక్కువ కేటాయించాలని ప్రధాని మోదీని కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు తొలి విడతగా 3 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. ఇవాళ బాబు గారు ఇవి కూడా చాలవు, మరో 6 లక్షల ఇళు కావాలని అడిగారు. తప్పకుండా ఇస్తాం. ఈ 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక, మళ్లీ 3 లక్షలు, ఆ తర్వాత మరో 3 లక్షలు ఇచ్చి రాష్ట్రంలోని ప్రతి పేదవాడి సొంతింటి కలను ప్రధాని మోదీ ఆశీస్సులతో, చంద్రబాబు నాయకత్వంలో నెరవేరుస్తాం" అని హామీ ఇచ్చారు. బుర్రిపాలెంలో 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్లు నిర్మించడం దేశానికే ఆదర్శమని, ఇది సమయాన్ని, ఖర్చును తగ్గిస్తుందని ప్రశంసించారు.

**మోదీ-బాబు నాయకత్వంలో 360 డిగ్రీల అభివృద్ధి**

ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ, ఇక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చేస్తున్నారని చౌహాన్ అన్నారు. "మోదీ, బాబు అంటే ఒకటి ం ఒకటి = రెండు కాదు.. ఒకటి ం ఒకటి = పదకొండు. వారితో పవన్ కల్యాణ్ కూడా తోడయ్యారు. ఈ ముగ్గురూ కలిసి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పరుగులు పెట్టిస్తారు. అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తిస్తూ పార్లమెంటులో చట్టం చేశాం. రాష్ట్రానికి రూ. 15,000 కోట్ల ఆర్థిక సహాయం అందించాం. జగన్ సర్కారు పక్కన పెట్టిన పోలవరం ప్రాజెక్టును 100 శాతం కేంద్ర నిధులతో పూర్తి చేస్తాం" అని స్పష్టం చేశారు.

**మహిళలు, రైతుల సంక్షేమానికి పెద్దపీట**

రాష్ట్రంలోని ఏ సోదరి పేదరికంలో ఉండకూడదనే లక్ష్యంతో 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం 23 లక్షలుగా ఉన్న లఖ్‌పతి దీదీల సంఖ్యను 60 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చారు. మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడే 'సరస్ మేళా'ను తొలిసారిగా ఢిల్లీ నుంచి బయటకు తీసుకొచ్చి, అక్టోబర్ 15న విజయవాడలో నిర్వహిస్తున్నామని ప్రకటించారు. ఇది మహిళల పాలిట కుంభమేళా అవుతుందన్నారు. రైతుల కోసం కేంద్రం ఇస్తున్న రూ. 6,000కు అదనంగా, చంద్రబాబు 'అన్నదాత సుఖీభవ' కింద మరో రూ. 14,000 కలిపి మొత్తం రూ. 20,000 అందించి రైతులకు అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్రాన్ని హార్టికల్చర్ హబ్‌గా మార్చి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని భరోసా ఇచ్చారు. "చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ఇక సర్వైవింగ్ స్టేట్ కాదు, షైనింగ్ స్టేట్‌గా మారింది. ఆస్పిరేషనల్ ఆంధ్ర, యాంబిషియస్ ఆంధ్ర, ఆసమ్ ఆంధ్రగా రూపుదిద్దుకుంటోంది. ప్రతి ఒక్కరి కలలను నెరవేర్చే బాధ్యత ఎన్డీఏ ప్రభుత్వం తీసుకుంటుంది" అని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తన ప్రసంగాన్ని ముగించారు.

# ఐదేళ్ల సర్వీసులో నాలుగు అవార్డులు సాధించిన ఉద్యోగి

మనం చేసే పని చిన్నదా, పెద్దదా అనేది ముఖ్యం కాదు, ఎంత నిబద్ధతతో చేస్తున్నామనేదే ముఖ్యం. అంకితభావంతో పనిచేసేవారికి వెంటనే ఫలితం కనిపించకపోయినా, దీర్ఘకాలంలో మాత్రం తప్పక గుర్తింపు లభిస్తుంది. అంతేగాక వారు సాధించే విజయాలు, గౌరవం సమాజంలో, సంస్థలో చాలా గొప్పగా ఉంటాయి. కష్టపడి పనిచేసే గుణం ఎప్పుడూ వృథా పోదు. అది మనల్ని ఉన్నత స్థానాలకు తీసుకెళ్తుంది. అలాగే బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించడం ద్వారా అధికారుల్లో, సమాజంలో మంచి గౌరవం లభిస్తుంది. అందులోనూ ప్రభుత్వ విధుల్లో అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపు లభిస్తుంది. చేస్తున్నది చిన్న ఉద్యోగమైనా నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తే ఉన్నతస్థాయి పురస్కారాలు సైతం దక్కుతాయి. ఇందుకు పోలవరం జిల్లా వరరామచంద్రాపురం మండలంలోని వడ్డిగూడెం-1 అంగన్‌వాడీ కార్యకర్త పి.లక్ష్మీకుమారి నిదర్శంగా నిలుస్తున్నారు. విధుల్లో చేరిన ఐదేళ్లలోనే నాలుగు అవార్డులు అందుకున్నారు. వీటిలో ఒకటి జాతీయస్థాయి పురస్కారం కావడం విశేషం.

**అంకితభావంతో**

వడ్డిగూడెం పంచాయతీలోని ధర్మతాళ్లగూడెం గ్రామానికి చెందిన లక్ష్మీకుమారి అదే పంచాయతీలోని వడ్డిగూడెం-1 అంగన్‌వాడీ కేంద్రంలో అయిదేళ్ల క్రితం కార్యకర్తగా విధుల్లో చేరారు. సమయపాలన, పరిశుభ్రతకు ఆమె ప్రాధాన్యం ఇస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని శుభ్రంగా ఉంచడంతో పాటు ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటల ద్వారా విద్యా బోధన చేస్తున్నారు. లబ్ధిదారులకు పౌష్టికాహారం, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ అవి అందేలా చూస్తున్నారు.

**కిచెన్ గార్డెన్ నిర్వహణ**

కేంద్రం వద్ద ఉన్న కొద్దిపాటి స్థలంలో కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేసి అరటి తదితర పండ్ల మొక్కలు పెంచుతున్నారు. చేతికి




వచ్చిన కాయలు, పండ్లను లబ్ధిదారులతో పాటు, గ్రామస్థులకు అందిస్తున్నారు.

**సాధించిన అవార్డులు :**

26 జనవరి 2025: చింతూరు ఐటీడీఏలో ఉత్తమసేవా పురస్కారం

26 జనవరి 2026: దిల్లీలో జాతీయస్థాయిలో ఉత్తమసేవా అవార్డు

ఈ ఏడాది మార్చి: మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో మహిళా రత్న అవార్డు

గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ అంగన్‌వాడీ అవార్డు

పనిని దైవంగా భావిస్తా : ' నేను పనిచేస్తున్న అంగన్‌వాడీ కేంద్రంలో మొత్తం 58 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో 22 మంది ప్రీస్కూల్ పిల్లలు. బాలింతలు, గర్భిణులు 16 మంది, ఇతరులు 20 మంది ఉన్నారు. వారికి మెరుగైన సేవలు అందించడం నా బాధ్యతగా భావిస్తున్నా. పనిని దైవంగా భావించి విధులు నిర్వహిస్తున్నా. గ్రామస్థులు సహకరిస్తున్నారు. అధికారులు ప్రోత్సహిస్తున్నారు' అని అంగన్‌వాడీ కార్యకర్త పి.లక్ష్మీకుమారి తెలిపారు.

# ఆర్టీసీలో 'కాంట్రాక్ట్' కండక్టర్లు!

# ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా వ్యవస్థలో సరికొత్త మార్పులు

ఏపీఎస్ఆర్టీసీలో కండక్టర్ల కొరతను అధిగమించేందుకు అధికారులు కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నారు. తొలిసారిగా ప్రైవేటు వ్యక్తులను కండక్టర్లుగా తీసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నారు. పొరుగు సేవలు (ఔట్‌సోర్సింగ్), కాంట్రాక్ట్ లేదా ఆన్‌కాల్ విధానం ద్వారా అర్హులైన వ్యక్తులతో విధులు నిర్వర్తించేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీసీలో సుమారు 3,600 మంది డ్రైవర్లు, 2,400 మంది కండక్టర్ల కొరత ఉంది. ప్రతి నెలా వయసు పైబడిన ఉద్యోగులు పదవీ విరమణ పొందుతున్నారు. దానికి తగ్గట్లుగా కొత్త నియామకాలు మాత్రం జరగడం లేదు. కండక్టర్ల కొరత ఉండటంతో అనేక డిపోల్లో బస్సు సర్వీసులను ఆకస్మికంగా రద్దు చేయాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ఉన్న రెగ్యులర్ కండక్టర్లతోనే డబుల్ డ్యూటీలు వేయించి సర్దుబాటు చేసే ప్రయత్నం చేస్తున్నా, సమస్య మాత్రం పూర్తిగా తీరడం లేదు.

**డ్రైవర్లకు ఇప్పటికే ఆన్‌కాల్ విధానం**

డ్రైవర్ల కొరతను తీర్చేందుకు ఆర్టీసీ అధికారులు ఇప్పటికే ఆన్‌కాల్ విధానాన్ని అమలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ డిపోల్లో ప్రతిరోజూ దాదాపు 1,800 మంది ఆన్‌కాల్ డ్రైవర్లతో బస్సులు నడిపిస్తున్నారు. రోజువారీ అవసరాల కోసం రెగ్యులర్ డ్రైవర్లు పోను, అదనంగా అవసరమైన వారిని బయట నుంచి తీసుకుంటున్నారు. వీరికి రోజుకు రూ.1,000 చొప్పున పారితోషికం చెల్లిస్తున్నారు. ఇప్పుడు ఇదే తరహాలో కండక్టర్లను కూడా తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు.




**తెలంగాణ మోడల్ పరిశీలన**

కండక్టర్ల నియామకం కోసం తెలంగాణ ఆర్టీసీ అమలు చేస్తున్న విధానాన్ని ఏపీ అధికారులు లోతుగా అధ్యయనం చేస్తున్నారు. తెలంగాణలో ఏడాది కాలంగా కాంట్రాక్టర్ల ద్వారా పొరుగు సేవల కింద కండక్టర్లను తీసుకుంటున్నారు. ఈ విధానంలో ఒక్కో డిపో పరిధిలో కాంట్రాక్టర్ ఆర్టీసీకి రూ.2 లక్షల వరకు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. డిపోకు రోజుకు ఎంతమంది కండక్టర్లు అవసరమో, అంతమందిని ఆ కాంట్రాక్టరే సమకూర్చాలి. డ్యూటీ సమయంలో టికెట్ ఛార్జీల వసూళ్లలో నగదు తేడా వచ్చినా, టికెట్ జారీ యంత్రం (టిమ్) పాడైనా, కాంట్రాక్టర్ చెల్లించిన డిపాజిట్ నగదు నుంచే రికవరీ చేస్తారు. ఈ కాంట్రాక్ట్ విధానాన్ని ఏపీఎస్ఆర్టీసీలో సైతం అమలు చేస్తే ఎలా ఉంటుందనే కోణంలో అధికారులు ముమ్మరంగా చర్చలు జరుపుతున్నారు. ప్రత్యామ్నాయంగా ఇంకా ఏవైనా మెరుగైన విధానాలు ఉన్నాయా అని కూడా ఆరా తీస్తున్నారు. ఈ అంశంపై త్వరలోనే ఓ స్పష్టమైన నిర్ణయం వెలువడే అవకాశం ఉందని ఆర్టీసీ వర్గాలు వెల్లడించాయి.

## 3డీ ప్రింటింగ్‌తో పేదల ఇళ్లు..

-మొదటిపేజీ తరువాయి

టెక్నాలజీ గురించి వివరించారు.

ఈ విధానంలో కేవలం 10 రోజుల్లోనే ఒక ఇంటి నిర్మాణం పూర్తి చేయవచ్చని, ఇది ఎంతో పటిష్టంగా ఉంటుందని తెలిపారు. ఈ ఇళ్లలో బయటి వాతావరణంతో పోలిస్తే ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందని, ఇది పేదలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో చేపడుతున్న ఈ 3డీ గృహ నిర్మాణం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంసించారు.

**9 లక్షల ఇళ్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్**

అనంతరం జరిగిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. పేదలకు సొంతిల్లు వారి ఆత్మగౌరవాన్ని పెంచుతుందని, ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి సాధారణ కోటా కింద 75 వేల ఇళ్లు మాత్రమే ఉండగా, తన విజ్ఞప్తి మేరకు కేంద్రం 3 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని చెప్పారు. ఈ 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలోపే మరో 3 లక్షలు, వచ్చే ఏడాది ఇంకో 3 లక్షల ఇళ్లను మంజూరు చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని, మొత్తంగా 9 లక్షల ఇళ్లకు కేంద్రం సహకరిస్తోందని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 6 లక్షల ఇళ్లను రద్దు చేశారని, నివాసయోగ్యం కాని ప్రదేశాల్లో స్థలాలు ఇచ్చి పేదలను మోసం చేశారని విమర్శించారు.

**షైనింగ్ ఆంధ్రాగా ఏపీ: శివరాజ్‌సింగ్ చౌహాన్**

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. విజనరీ నేత చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ఇక "షైనింగ్ ఆంధ్రా, అడ్వాన్స్‌డ్ ఆంధ్రా, అచీవింగ్ ఆంధ్రా"గా మారబోతోందని కొనియాడారు. పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న చంద్రబాబు సంకల్పం గొప్పదని ప్రశంసించారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు అందిస్తున్నారని, రాష్ట్రంలోని అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు సుఖంగా ఉండాలనే విధానంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమ ో భాగంగా సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి చౌహాన్.. ఒక లబ్ధిదారురాలి ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసి, వారికి నూతన వస్త్రాలు అందించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. వేదికపై లక్ష్మీ అనే మహిళకు ఇంటి పట్టాను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిస్తున్నారంటూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. కృష్ణా నది జలాలు పొరుగు రాష్ట్రంలోని కుప్పంకు వెళుతున్నాయని, కానీ మన మహబూబ్‌నగర్ రైతులకు మాత్రం చుక్క నీరు అందడం లేదని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత మూడేళ్లలో ఏ ఒక్క నీటిపారుదల ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టకపోవడం వల్లే రాష్ట్రం నేడు కరవుతో అల్లాడుతోందని విమర్శించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో కవిత మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, ప్రభావిత మండలాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా కరవు మండలాలను ప్రకటించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోందన్నారు. "నార్లాపూర్ రిజర్వాయర్‌పై కొంతైనా ఖర్చు చేసి ఉంటే, ఈరోజు దాన్ని నింపుకొని కల్వకుర్తి ఆయకట్టుకైనా నీరందించే అవకాశం ఉండేది. దానివల్ల భూగర్భ జలాలు కూడా పెరిగేవి" అని కవిత అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ.. పాలమూరు-రంగారెడ్డి వంటి ఎత్తిపోతల పథకాలను నింపకుండా మన నీటిని ఏపీకి తరలిస్తున్నారని ఆరోపించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం 6-7 గంటల కోతలతో సరిపెడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికే కాకుండా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన పట్టణాల్లోనూ తాగునీటి ఎద్దడి మొదలైందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కరవుతో నష్టపోతున్న రైతులకు, ప్రజలకు తమ పార్టీ అండగా ఉంటుందని, 60 నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జ్‌లు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని కవిత భరోసా ఇచ్చారు.

## ఏపీలో 'తల్లికి వందనం'.. రెండో విడతకు రంగం సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

సంవత్సరం విద్యార్థులు ఈ జాబితాలో ఉన్నారు. వీరితో పాటు, గతంలో సాంకేతిక కారణాలు, ఇతర మార్పుల వల్ల డబ్బులు అందని వారికి కూడా ఈ విడతలో నిధులు అందించనున్నారు. అధికారులు ఇప్పటికే లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసి తుది జాబితాను సిద్ధం చేశారు. నిధుల విడుదలకు సంబంధించిన ఫైల్‌కు ఆర్థిక శాఖ కూడా ఆమోదముద్ర వేసింది. ప్రస్తుతం ఈ ఫైల్ సీఎంవో వద్ద తుది ఆమోదం కోసం ఉంది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అనుమతి లభించిన వెంటనే, ఒకటి రెండు వారాల్లో లేదా వచ్చే వారంలోనే నిధులు జమ అయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో, లబ్ధిదారులు తమ బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ అయ్యిందా లేదా, ఈ-కేవైసీ పూర్తయిందా అనే వివరాలను సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యార్థి, తల్లి ఆధార్ వివరాలు, బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్సీ కోడ్ వంటివి సరిగ్గా ఉంటే నిధులు ఎలాంటి ఆటంకాలు లేకుండా సకాలంలో జమ అవుతాయని వారు స్పష్టం చేశారు.

## 'అమరజీవి జలధార' (జల్ జీవన్ మిషన్) పథకానికి శ్రీకారం

-మొదటిపేజీ తరువాయి

జాతికి అంకితం చేస్తారు. అధికారిక షెడ్యూల్ ప్రకారం, సోమవారం ఉదయం 11:20 గంటలకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రొద్దుటూరులో జల్ జీవన్ మిషన్‌కు సంబంధించిన ప్రత్యేక శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విధానాలు, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలపై వారు ప్రజలకు వివరించే అవకాశం ఉంది. నేతల పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందుకోసం సుమారు రూ.30,156 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించింది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 27.36 లక్షల కొత్త గృహ కుళాయి కనెక్షన్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ముఖ్యంగా, తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం నడిచివెళ్లే గ్రామీణ మహిళల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపడమే ఈ పథకం యొక్క ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం స్పష్టం చేసింది. టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వంలో ఇది ఒక కీలకమైన గ్రామీణ సంక్షేమ కార్యక్రమంగా నిలవనుంది.



## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:** 33/11 కేవీ మరమ్మత్తులు కారణంగా పొందూరు ,లోలుగు సబ్ స్టేషన్ లో 11 కేవీ కొంచాడ ఇండస్ట్రియల్ ఫీడర్ ,బాణం ఫీడర్ లో నేడు సోమవారం నాడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్ శాఖ ఏ.ఈ సుధీర్ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బాణం దల్లిపేట ,రెడ్డి పేట ,బేబిరాజు పేట తానేం లోలుగు అగ్రికల్చర్ ,నర్సాపురం అగ్రహారం అగ్రికల్చర్ సర్వీసెస్ కొంచాడ ఇండస్ట్రియల్ ఫీడర్ సర్వీసెస్ లలో లైన్ కు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగింపు,కండక్టర్ రీప్లేస్మెంట్ వర్క్ ,ఇతర అత్యవసర మరమత్తులు కారణంగా ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయా గ్రామాల వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని కోరారు.

## చింతరేగుపల్లి గ్రామంలో!..గంజాయి సేవిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నాం!..

ఎస్సై ఎస్.కె సాధిక్!..



**వరరామచంద్రాపురం, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** గంజాయి సేవించినా, గంజాయి కలిగి ఉన్నా, గంజాయి రవాణా చేసినా, చట్టరీత్యా నేరమని కేసు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎస్.కె. సాధిక్, హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు చింతరేగుపల్లిలో, గంజాయిని సేవిస్తున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్దనుండి 490 గ్రాములు గంజాయిని అదేవిధంగా ఆరు మోటార్ బైకులను, లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని, ఎస్సై ఎస్.కె సాధిక్, తెలిపారు. గంజాయిని కలిగి ఉండడం గంజాయిని సేవించడం గంజాయి రవాణాలో పాల్గొనడం చట్టరీత్యానేరం, పైవ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు.గంజాయి సేవించిన వ్యక్తులను కోర్ట్ ముందు హాజరు పరచడం జరుగుతుందని వివరించారు.

## లక్ష్మీపురం సీఎస్ఐ చర్చిలో ముగిసిన మహిళా వారోత్సవాలు

**భక్తిశ్రద్ధలతో ముగింపు ప్రార్థనలు.. ఆధ్యాత్మిక సందేశాలు**

**ఆకట్టుకున్న మహిళలు, చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు**



**ఎటపాక, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో గల సీఎస్ఐ చర్చిలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. సెప్టెంబర్ 29న ప్రారంభమైన ఈ వేడుకల ముగింపు సభను చర్చి పాస్టర్లు శ్రీకాంత్, అలోక్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వారం రోజులపాటు స్థానిక మహిళలు నిత్యం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని కుటుంబ శ్రేయస్సు, గ్రామంలో శాంతి సౌభాగ్యాలు, సమాజ పురోగతిని కాంక్షిస్తూ దైవ సన్నిధిలో వేడుకున్నారు. ఆదివారం జరిగిన ముగింపు వేడుకల్లో భాగంగా నిర్వహించిన స్తుతి ఆరాధనలు, ఆధ్యాత్మిక సందేశాలు విశ్వాసులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం మహిళలు, యువత, చిన్నారులు ఆలపించిన గ్రూప్ సాంగ్స్, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. మహిళల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని, ఐక్యతను, సేవాభావాన్ని పెంపొందించేందుకే ఈ వారోత్సవాలు దోహదపడ్డాయని తెలిపారు. మహిళలు పరస్పరం సహకరించుకుంటూ కుటుంబాలను, సమాజాన్ని సన్మార్గంలో నడిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రార్థనల అనంతరం హాజరైన భక్తులకు సామూహిక అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో లక్ష్మీపురంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, మహిళలు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సౌభాగ్యదాయిని చింతలూరు శ్రీ నూకాలమ్మకు పసుపు కుంకుమలతో అలంకరణ.



**ఆలమూరు అక్టోబర్ 4(ప్రజాజ్యోతి):** రానున్న భాద్రపద అమావాస్య సందర్భంగా ఆదివారం నాడు ప్రముఖ పుణ్యక్షేత్రం సౌభాగ్యదాయిని చింతలూరు శ్రీ నూకాలమ్మ అమ్మవారిని పసుపు కుంకుమలతో అలంకరించారు. ఏడు కేజీల పసుపు, మూడు కేజీల కుంకుమ ప్యాకెట్లుగా రూపొందించి అమ్మవారికి చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సామర్లకోటకు చెందిన దీపారాధన సంఘం సభ్యులు ఈ అలంకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 10వ తేదీ అమావాస్య వరకు అమ్మవారు ఇదే అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని దేవస్థానం ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి, చైర్మన్ వీరి అప్పారావు, సభ్యులు గన్ని వెంకట్రావు తెలిపారు. సౌభాగ్యవల్లిగా కొలువైన శ్రీ నూకాలమ్మ అమ్మవారిని భక్తులంతా దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## బైక్ ప్రమాదంతో ఉపాధ్యాయుడికి గాయాలు!..



**వరరామచంద్రాపురం, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** అన్నవరం చప్టావద్ద శనివారం, రాత్రి బైక్ ప్రమాదం జరిగింది. వివరాలు ఈవిధంగా ఉన్నాయి.అరుణ్ కుమార్,టీచర్ రామవరం స్కూల్లో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం,స్వగ్రామం అమలాపురం, మెరుగైన వైద్యం కోసం, టౌన్ తీసుకు వెళ్లినట్లు తెలుస్తుంది.ఎవరైనా ఈమార్గంలో బైక్ (నడిపేటప్పుడు) ప్రయాణం చేసేటప్పుడు ,చప్టాపై జాగ్రత్తగా ఉండాలని అధికారులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# నందికొట్కూరులో ఘనంగా “టైని టైగర్స్ డాష్ - తైక్వాండో కిడ్స్ రన్ 2026”



**ప్రజా జ్యోతి నందికొట్కూరు** నందికొట్కూరు పట్టణంలో “టైని టైగర్స్ డాష్ - తైక్వాండో కిడ్స్ రన్ 2026” కార్యక్రమం ఆదివారం ఉదయం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. బైరెడ్డి శబరమ్మ టైక్వాండో అకాడమీ ఆదేశాల మేరకు, నందికొట్కూరు తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు, మాస్టర్ ఎం. బి .రాంబాబు నాయుడు ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. మిడ్తూర్ రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉదయం 6 గంటలకే ఈ రన్నింగ్ రేస్ ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నందికొట్కూరు మాజీ మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ఈ కిడ్స్ రన్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ రన్నింగ్ పోటీల్లో సుమారు 60 మంది చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా దాసి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఆరోగ్యం, ఆత్మరక్షణ, క్రమశిక్షణ చాలా ముఖ్యమని పేర్కొన్నారు. చిన్నారుల్లో శారీరక దృఢత్వంతో పాటు బుద్ధి బలాన్ని పెంపొందించుకోవడానికి తైక్వాండో శిక్షణ ఎంతో దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ ఈ విద్యను నేర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో సీపీఐ నాయకులు రఘురాంమూర్తి, సీపీఐ లిబరేషన్ ఎమ్మెల్సీ పిక్కిలి వెంకటేశ్వర్లు, లాయర్ బి. వెంకటేశ్వర్లు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సిల్వర్ వెంకటేశ్, బీజేపీ జిల్లా కార్యదర్శి జి. రవికుమార్ రెడ్డి, సీపీఐ రమేష్, హరీష్, సాయికుమార్ లతో పాటు టైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్నారులను ఉత్సాహపరిచారు.

## పాఠశాలల అభివృద్ధిలో ఎస్ఎంసీల పాత్ర కీలకం

ఎం.వి. ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ భాస్కర్

విద్య హక్కు చట్టం అమలుపై ఎస్ఎంసీలకు శిక్షణ సమావేశం



**హోళగుంద,అక్టోబర్ 4, ప్రజా జ్యోతి న్యూస్:-** విద్యాహక్కు చట్టాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో పాఠశాల నిర్వహణ కమిటీలు (ఎస్ఎంసీ) క్రియాశీలక పాత్ర పోషించాలని ఎం.వి. ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ భాస్కర్, మండల విద్యాధికారి (ఎంఈఓ) కబీర్ పిలుపునిచ్చారు. ఎం.వి. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక 'వెలుగు' కార్యాలయంలో హోలగుంద మండల స్థాయి ఎస్ఎంసీ కమిటీల శిక్షణా సమావేశం నిర్వహించారు.?ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ప్రాథమిక మౌలిక వసతులు కల్పించడంలో ఎస్ఎంసీ సభ్యులు చొరవ చూపాలని సూచించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు పరస్పర సమన్వయంతో పనిచేసినప్పుడే పాఠశాలలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దబడతాయన్నారు.ఈ సమావేశంలో కొన్ని ప్రధాన తీర్మానాలు సూచనలు చేశారు.

**మౌలిక సదుపాయాల గుర్తింపు:**
ప్రతి పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, తరగతి గదుల స్థితిగతులను పరిశీలించి, సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.

**డ్రాప్‌అవుట్స్‌కు చెక్:-**
బడి బయట ఉన్న పిల్లలు, మధ్యలో చదువు మానేసిన విద్యార్థులను గుర్తించి తిరిగి బడిబాట పట్టించాలి.

**వలస పిల్లలపై ప్రత్యేక దృష్టి:**
ఉపాధి వలసల వల్ల విద్యాహక్కుకు దూరమవుతున్న పిల్లలను గుర్తించి, వారి విద్యకు అంతరాయం కలగకుండా చూడాలి.

**హాజరు -- ప్రవేశాల పెంపు:**
పాఠశాలల్లో విద్యార్థుల నిరంతర హాజరును పెంపొందించడంతో పాటు, నూతన ప్రవేశాలు (అడ్మిషన్లు) పెంచేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. ప్రతి చిన్నారికి ఉచిత, నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించా లని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.వి. ఫౌండేషన్ ప్రతి నిధులు సేవా నాయక్, విజయ్, మౌలసబ్, మల్లీశ్వరి, శేఖన్న, వివిధ పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

## చింతూరు డివిజన్ కేంద్రంలో సివిల్, క్రిమినల్ న్యాయస్థానాలు ఏర్పాటు చేయాలి

జిల్లా సెషన్స్ కోర్టు, జేఎఫ్‌సీఎం, సబ్ జైలును తక్షణమే మంజూరు చేయాలి

విలీన మండలాల ప్రజలకు న్యాయసేవలు చేరువ చేయాలి

ప్రభుత్వం స్పందించకపోతే అఖిలపక్షంతో ఉద్యమం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నక్క వెంకన్న



**ఎటపాక, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి):**రాష్ట్ర విభజన జరిగి ఏళ్లు గడుస్తున్నా విలీన మండలాల ప్రజలకు న్యాయస్థానాలను అందుబాటులోకి తీసుకురాకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎటపాక మండల అధ్యక్షుడు నక్క వెంకన్న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతూరు డివిజన్ కేంద్రంగా తక్షణమే సివిల్, క్రిమినల్ కోర్టులను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం రాష్ట్రంలో విలీనమైన ఎటపాక, కూనవరం, వి.ఆర్.పురం, చింతూరు మండలాలకు ఇప్పటివరకు ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేయకపోవడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్ పరిధిలోని ప్రజలు చిన్నపాటి కేసుల విచారణ కోసం, న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం వందల కిలో మీటర్ల దూరంలో ఉన్న కోర్టులకు వెళ్లాల్సి వస్తోందన్నారు. దీనివల్ల నిరుపేద ఆదివాసీ, గిరిజనేతర ప్రజలకు తీవ్ర వ్యయప్రయాసలతో పాటు సమయం, డబ్బు వృథా అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విలీన మండలాల ప్రజల చిరకాల న్యాయ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలంటే చింతూరు డివిజన్ కేంద్రంగా జిల్లా అదనపు సెషన్స్ కోర్టు, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు, సబ్ జైలుతో పాటు సివిల్ వివాదాల సత్వర పరిష్కారానికి సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ కోర్టును తక్షణమే మంజూరు చేయాలని స్పష్టం చేశారు. చింతూరు కేంద్రంగా కోర్టులు ఏర్పడితేనే స్థానిక ప్రజలకు న్యాయం చేరువవుతుందని పేర్కొన్నారు. ఈ న్యాయమైన డిమాండ్‌పై కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో విలీన మండలాల్లోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, న్యాయవాద సంఘాలను ఏకం చేసి పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని వెంకన్న హెచ్చరించారు.

## బనగానపల్లెలో ఏపీ ఎమ్మార్పీఎస్ 13వ వార్షికోత్సవ సభ కరపత్రాల విడుదల

**అక్టోబర్ 12న బనగానపల్లెలో భారీ బహిరంగ సభ**

**పెద్ద ఎత్తున తరలిరావాలని ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకుల పిలుపు**



**బనగానపల్లె=అక్టోబర్=04 ప్రజాజ్యోతి** బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 13వ వార్షికోత్సవ మహా బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు, చర్మ, డప్పు కళాకారుల పింఛన్ల పోరాట యోధుడు మన్యశ్రీ దండు వీరయ్య మాదిగ, ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పూలరాజు మాదిగ గారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 2026 అక్టోబర్ 12వ తేదీన బనగానపల్లెలో ఏపీ ఎమ్మార్పీఎస్ 13వ వార్షికోత్సవ సభను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మాదిగల హక్కుల సాధన, సామాజిక న్యాయం, చర్మకారులు, డప్పు కళాకారుల సంక్షేమం కోసం ఏపీ ఎమ్మార్పీఎస్ నిరంతరం పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. ఈ వార్షికోత్సవ సభను విజయవంతం చేసేందుకు మాదిగ ప్రజానీకం, మాదిగ విద్యార్థులు, విద్యార్థినులు, చర్మ, డప్పు కళాకారులు, ఏపీ ఎమ్మార్పీఎస్ మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ సభకు ప్రతి గ్రామం నుంచి మాదిగ సోదరులు, సోదరీమణులు, యువత, విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై ఐక్యతను చాటాలని, హక్కుల సాధన కోసం సమిష్టిగా ముందుకు సాగాలని నాయకులు కోరారు. అక్టోబర్ 12న నిర్వహించనున్న ఈ మహా బహిరంగ సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో లక్ష్మన్న, కిట్టు, సాదేవుడు, ఏపీ ఎమ్మార్పీ ఎస్ జిల్లా నాయకులు, డొక్కల సంఘం జిల్లా అధ్యక్షులు సవారి, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పొందూరులో మహిళలకు ఉచిత చేనేత శిక్షణ

**- ఖాదీ క్లస్టర్‌తో మహిళలకు ఉపాధి అవకాశాలు**

**- ఆసక్తి ఉన్న మహిళలు వెలుగు కార్యాలయాన్ని సంప్రదించాలి**

**- ఏపియంలు గురుగుబెల్లి శ్యామలరావు, ఆర్ రామ్మూర్తి**



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:**మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో పొందూరు పట్టణంలో ఖాదీ క్లస్టర్ ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఏపీఎంలు గురుగుబెల్లి శ్యామలరావు, ఆర్. రామ్మూర్తి తెలిపారు. ఇందులో భాగంగా సాయిబాబా వీవర్స్ సొసైటీ నూతన భవనంలో డీఆర్డీఏ--సెర్ప్ ఆధ్వర్యంలో మహిళలకు చేనేత మగ్గాలపై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కూన రవైకుమార్,జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఇటీవల ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఎంలు మాట్లాడుతూ చేనేత శిక్షణ పొందేందుకు తప్పనిసరిగా నేత కార్మికులై ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. 18 నుంచి 38 సంవత్సరాల వయస్సు కలిగి, ఆసక్తి ఉన్న స్వయం శక్తి సంఘాల సభ్యులైన మహిళలు ఎవరైనా ఈ శిక్షణలో పాల్గొనవచ్చని తెలిపారు. శిక్షణ కాలంలో మహిళలకు స్టైఫండ్ కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు.ఆసక్తి ఉన్న మహిళలు తమ ఫొటోతో కూడిన బయోడేటాకు ఆధార్ కార్డు జతచేసి వెలుగు కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. పొందూరులో ఏర్పాటు చేయనున్న ఖాదీ క్లస్టర్ నిర్మాణం పూర్తయిన అనంతరం శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనీలకు అక్కడే ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చేనేత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఏపీఎంలు సూచించారు.

## పాలన్నగారిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

**షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ**



**రామాపురం అక్టోబర్ 04 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లా రామాపురం మండలం పాలన్న గారిపల్లిలో సువర్ణ భారతి, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్థులకు ఉచితంగా షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ వారణాసి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ "ఆరోగ్యమే మహాభాగ్యం" అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలను పాటించాలని, వ్యాధులను ముందుగానే గుర్తించి వైద్యుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా ఆరోగ్య సమస్యలను నియంత్రించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు కిరణ్, దుర్గ, మహేష్, ప్రకాష్, హేమంత్, బాలు, గ్రామస్థులు జయచంద్రారెడ్డి, రసూల్ వలి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో కుటుంబ పెద్దను కోల్పోయిన ఇంటికి భరోసా

**మృతుడి భార్యకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం. ఆర్థిక సాయం**



**బాపట్ల అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ప్రమాదంలో కుటుంబ పెద్దను కోల్పోయిన బేతపూడి గ్రామానికి చెందిన నాయుడు శ్రీనివాసరెడ్డి (వాసు) కుటుంబానికి అండగా నిలిచేలా చర్యలు చేపట్టారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ ఆదేశాల మేరకు ఆదివారం బాపట్ల మార్కెట్ యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కుటుంబానికి 30 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇద్దరు చిన్నపిల్లలతో భర్తను కోల్పోయిన నాయుడు అంజలి కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఆమెకు ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. కష్టకాలంలో ప్రభుత్వం, పార్టీ తరఫున కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బేతపూడి టీడీపీ నాయకులు నాయుడు శ్రీనివాసరెడ్డి, కోట గాంధీరెడ్డి, సాయిబ్‌రెడ్డి, పుల్లారెడ్డి, వేదుళ్లపల్లి టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, గుడిపల్లి సాంబయ్య వెస్ట్ బాపట్ల టీడీపీ నాయకులు సమ్మెట మల్లికార్జునరెడ్డి, తుమ్మ వెంకటేశ్వర్లు, కావూరి విష్ణు, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లే లక్ష్యం సామాజిక న్యాయమే మా ప్రభుత్వ విధానం

**బీసీల రాజకీయ ప్రాతినిధ్యం కోసం కట్టుబడి ఉన్నాం: మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**రాయచోటి,అక్టోబర్ 4 ప్రజా జ్యోతి** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు సామాజిక న్యాయాన్ని సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్ని స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో అసెంబ్లీలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుని జీవో నంబర్ 105, 1065 జారీ చేసిందని తెలిపారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఎన్నికలు జరగకపోయినా, బీసీలకు రిజర్వేషన్ దక్కకూడదనే కుట్రతో గోడ్డలి పార్టీ నేతలు అడ్డుకుంటున్నారని మంత్రి విమర్శించారు. బీసీలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని స్పష్టం చేశారు. న్యాయపరంగా ఉన్న ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుని బీసీలకు న్యాయం జరిగేలా చూస్తామని, వైసీపీ హయాంలో 34 శాతం రిజర్వేషన్ల కోసం కొట్టేసిన సుప్రీంకోర్టు తీర్పులకు వ్యతిరేకంగా వెళ్లకుండా బీసీలకు చారిత్రాత్మక ద్రోహం చేశారని మంత్రి పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న తమ సంకల్పం మారదని, బీసీలకు న్యాయం జరిగే వరకు కృషి చేస్తామని తెలిపారు. 34 శాతం రిజర్వేషన్లతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని మంత్రి అన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇస్తే రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందని, కులంతో సంబంధం లేకుండా అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలి బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా వారి సమస్యలను మరింత సమర్థవంతంగా పరిష్కరించే అవకాశం ఉంటుందని మంత్రి అన్నారు. సమాజంలో వెనుకబడి ఉన్న బీసీల అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. పైకోర్టు తీర్పును గౌరవిస్తూ బీసీలకు న్యాయం జరిగేలా సుప్రీంకోర్టులో న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తామని మంత్రి తెలిపారు. ఇది కేవలం రిజర్వేషన్ల అంశం మాత్రమే కాదని, బీసీలకు దక్కాల్సిన రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశమని స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాలుగా బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా వివిధ ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయని మంత్రి గుర్తు చేశారు. 1987లో బీసీలకు 20 శాతం, 1995లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడమే లక్ష్యంగా ఈ విధానం కొనసాగుతోందన్నారు. బీసీలకు న్యాయం జరగాలి.. వారికి దక్కాల్సిన రాజకీయ ప్రాతినిధ్యం దక్కాలి. 34 శాతం రిజర్వేషన్ల అమలు కోసం ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన, న్యాయపరమైన మార్గాల్లో ముందుకు సాగుతుంది అని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణ వలన మాలలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వైసిపి పుల్లయ్య ఆరోపించారు



**నంద్యాల =అక్టోబర్=04 ప్రజాజ్యోతి** ఆదివారం నాడు నంద్యాల పట్టణంలో మాల మహానాడు నంద్యాల జిల్లా అధ్యక్షుడు బండి దేవాంతకుడు అధ్యక్షతన మాలల జిల్లా స్థాయి విస్తృత కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా దస్తగిరి వైసీపీ పుల్లయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ వలన మాలలకు అన్యాయం జరుగుతుందని అదేవిధంగా ఎస్సీ వర్గీకరణ రోస్టర్ విధానం మాలలపై దాడులు హత్యాచారాలు అధికమయ్యాయని వారు ఆరోపించారు దళితులకు సంబంధించి గత వైసిపి ప్రభుత్వం 26 దళిత పథకాలను రద్దుచేసి ఓడిపోయిందని వారు అన్నారు ఎన్నికల ముందు దళిత పథకాలు ప్రవేశపెడతామని కూటమి ప్రభుత్వము హామీ ఇచ్చి రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే దళితుల సమస్యలు పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు మాలలకు ఎంతో నష్టమైన జీవో నెంబర్ 102 ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు ఈ అన్ని సమస్యలపై నంద్యాల పట్టణంలో నవంబర్ మాసంలో మాల సంఘాల జయిన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సభ నిర్వహిస్తామని వారు తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు టి అశోక్ బాబు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పందు అశోక్ బాబు ఇతర మాల ప్రముఖుల హాజరవుతారని తెలిపారు ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు బి మద్దిలేటి స్మశాన కార్మిక హక్కుల పోరాట సమితి అధ్యక్షులు తలారి నాగరాజు మద్దూరు మాజీ సర్పంచ్ మాల రాజ్యాధికారి సభ నంద్యాల జిల్లా అధ్యక్షులు మద్దిలేటి నంద్యాల జిల్లా జేఏసీ అధ్యక్షులు కొప్పెర రాజేంద్ర రాష్ట్ర కార్యదర్శి అంకన్న రాయలసీమ అధ్యక్షులు అబ్రహాము రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రోజక్క మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లం రాజ్ కుమార్ వివిధ మండలాల నుండి వచ్చిన మాల మహానాడు మండల నాయకులు మాల కార్యకర్తలు పాల్గొన్నారు

# చిన్నారి భవనీత్‌కు బాసటగా

**మేము సైతం అంటూ విరాళాల వెల్లువ..**

**ఇప్పటివరకు రూ.5.50 లక్షల ఆర్థిక సాయం.**



**గాలివీడు:**మానవత్వం వెల్లువిరిసిన వేళ ప్రాణాంతక వ్యాధితో మృత్యువుతో పోరాడుతున్న రెండున్నరేళ్ల చిన్నారి భవనీత్‌కు దాతలు అండగా నిలుస్తున్నారు. చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం అందించాలంటూ ప్రచురితమైన కథనాలకు స్పందించిన పలువురు దాతలు, వివిధ వర్గాల ప్రజలు ముందుకు రావడంతో ఇప్పటివరకు రూ.5.50 లక్షల ఆర్థిక సాయం అందినట్లు చిన్నారి తల్లిదండ్రులు తెలిపారు. ఇందులో బ్యాంకు ఖాతా ద్వారా రూ.1.80 లక్షలు, నగదు రూపంలో రూ.3.70 లక్షలు అందినట్లు వారు వెల్లడించారు. అప్లాస్టిక్ అనీమియా అనే ప్రాణాంతక వ్యాధితో భవనీత్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసిందే. చిన్నారి వైద్య చికిత్సకు సుమారు రూ.30 లక్షల వరకు అవసరం కావడంతో తల్లిదండ్రులు వీరబల్లి వెంకటరమణ, శ్రీదేవి తమ బిడ్డను కాపాడేందుకు దాతల సహాయం కోసం కన్నీటి పర్యంతమవుతూ వేడుకుంటున్నారు. చిన్నారి పరిస్థితిపై వార్తా పత్రికలు, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరగడంతో విషయం ఊరూ వాడా చేరింది. దీంతో వందలు, వేల రూపాయలుగా ప్రారంభమైన సాయం క్రమంగా లక్షల రూపాయలకు చేరుకుంది. పల్లెలు, గ్రామాలు, వివిధ యూనియన్లు, వ్యాపారులు, పాఠశాలలు, కార్యాలయాల సిబ్బంది, మహిళలు, చిన్నారులు ఇలా అన్ని వర్గాల ప్రజలు తమకు తోచినంత సాయం చేస్తూ భవనీత్ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. తమ బిడ్డ పట్ల మానవత్వంతో స్పందించి ఆర్థిక సహాయం అందిస్తున్న ప్రతి ఒక్కరికీ చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు రూ.5.50 లక్షల సాయం అందినప్పటికీ వైద్యానికి ఇంకా భారీ మొత్తంలో నిధులు అవసరం కావడంతో మరింత సహాయం కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు. మానవతావాదులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చిన్నారి వైద్యానికి అవసరమైన నిధులు సమకూర్చేలా సహకరించాలని కుటుంబ సభ్యులు చేతులు జోడించి వేడుకుంటున్నారు. సహాయం చేయదలచిన వారు ఫోన్ పే: 7997510574 ద్వారా ఆర్థిక సాయం చేయాలని కోరారు.

# అంధులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

**బిసి రాజారెడ్డి**

**మా తండ్రి కీ. శే.బిసి గుర్రెడ్డి గారి జ్ఞాపకార్థం 2009 అక్టోబర్ లో ప్రారంభమైన పింఛన్ పంపిణీ కార్యక్రమం**

**18వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన అంధులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం**

**17 ఏళ్లుగా సొంత డబ్బులతో అందులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న బీసీ రాజారెడ్డి**



**బనగానపల్లె=అక్టోబర్=04 ప్రజాజ్యోతి** అంధులు ఆత్మస్థైర్యం తో ముందుకు సాగాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక బిసి గుర్రెడ్డి కాలనీలో అంధులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరికి రూ.700 చొప్పున 200 మందికి బిసి రాజారెడ్డి సొంత డబ్బులతో పింఛన్ పంపిణీ చేశారు. ముందుగా కీ.శే. బిసి గుర్రెడ్డి, బిసి లక్ష్మమ్మ దంపతులకు, కీ.శే. బిసి బాలతిమ్మారెడ్డిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ. మా తండ్రి కీ. శే.బిసి గుర్రెడ్డి గారి జ్ఞాపకార్థం 2009 అక్టోబర్‌లో అంధులకు పింఛన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభించామన్నారు. 17 ఏళ్లుగా ప్రతినెల ఒకటో తేదీనే సొంత డబ్బులతో వారికి పింఛన్ అందిస్తున్నామన్నారు. నేటితో పింఛన్ల పంపిణీ కార్యక్రమం 18 సంవత్సరంలోకి అడుగుపెట్టిందన్నారు. ఇన్నేళ్లుగా అంధులకు ఆర్థిక సాయం అందిస్తూ తన వంతుగా చేయూతనివ్వడం భగవంతుడిచ్చిన వరంగా భావిస్తానన్నారు. అంధులంటే చిన్నచూపు చూడటం తగదన్నారు. అంధులు, దివ్యాంగుల పట్ల గౌరవంగా మెలగాలని సూచించారు. వారికి మంచి చేయకపోయినా పర్వాలేదు కానీ చెడు మాత్రం చేయకూడదన్నారు. నేటి సమాజంలో రోజురోజుకు మానవత విలువలు కనుమరుగవు తుండడం బాధ కలిగిస్తోందన్నారు. నేటి ఆధునిక యుగంలో అందరూ డబ్బు కోసం పరిగెడుతూ మానవ సంబంధాలకు దూరం అవుతున్నారన్నారు. అంధులకు ఎంతో మనోధైర్యం ఉంటుందని వారు ఆత్మవిశ్వాసంతో బ్రెయిని లిపిలో ఉన్నత విద్యను అభ్యసిస్తే మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కడప జిల్లాకు చెందిన బూడిద శ్రీనివాసులు రెడ్డి, మహారాష్ట్ర ఉల్లాస నగరానికి చెందిన ప్రాంజల్ అనే మహిళ, తూర్పుగోదావరి జిల్లా గుండవల్లి గ్రామానికి చెందిన కట్టా సింహాచలం లు అంధులైనప్పటికీ పట్టుదలతో ఉన్నత విద్యలు చదివి ఐఏఎస్ లు అయ్యారన్నారు. హైదరాబాద్ కు చెందిన బొల్లా శ్రీకాంత్ అంధుడని హైదరాబాదు ఐఐటి లో సీటు నిరాకరిస్తే అమెరికాలో సీటు సంపాదించి నేడు 400 కోట్ల వ్యాపార సామ్రాజ్యానికి అధిపతి అయ్యాడన్నారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. మా తల్లిదండ్రులు కీ. శే. బిసి గుర్రెడ్డి, బిసి లక్ష్మమ్మ దంపతులు మా అన్నదమ్ములను క్రమశిక్షణతో పెంచి మా భవిష్యత్తుకు మంచి బాటలు వేశారన్నారు. వారి రుణం తీర్చుకునేందుకు సేవా కార్యక్రమాలు చేయడం వల్ల నాకు ఎంతో ఆత్మ సంతృప్తి లభిస్తోందన్నారు. తాను అందిస్తున్న పింఛను తీసుకుంటున్న 6 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు వారు అందత్వం ఉందని బాధపడకుండా ఎంతో మనోధైర్యంతో ముందుకు సాగి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అభినందనీయం అన్నారు. రేవనూరు గ్రామానికి చెందిన కొడవటి సునీత, పెద్దరాజుపాలెం గ్రామానికి చెందిన ఎం శ్రీకాంత్, గూటుపల్లి గ్రామానికి చెందిన ఆర్ మధు సుధాకర్, ఆత్మకూరుకు చెందిన షేక్ షాకీర్, గాజులపల్లి కు చెందిన సహారా బి, కోటపాడుకు చెందిన ఉసేనమ్మ లు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. బనగానపల్లె వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ... కుల మతాలకు , ప్రాంతాలకు అతీతంగా బిసి రాజారెడ్డి గారు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుంటున్నారని కొనియాడారు. బనగానపల్లె పట్టణ సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసిన ఘనత బిసి రాజారెడ్డికి దక్కుతుందన్నారు. మద్దిలేటి స్వామి క్షేత్రం, గోర్లగుట్ట సమీపంలో, గాజులపల్లె సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో , మీరాపురం వద్ద , బనగానపల్లె అయ్యప్ప స్వామి గుడి వద్ద సొంత డబ్బులతో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ లు ఏర్పాటు చేసి ప్రతినిత్యం వేలాదిమంది ప్రయాణికుల దాహార్తి తీరుస్తున్నారని కొనియాడారు. బిసి కుటుంబంతో తమ కుటుంబానికి ఎంతో ఆత్మీయ అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. భగవద్గీత ప్రచారకులు గురూజీ రామశేషయ్య మాట్లాడుతూ... బిసి రాజారెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు సమాజంలోని ప్రజలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. బీసీ రాజారెడ్డి లాగా మరి కొంతమంది ఆలోచన చేస్తే సమాజాభివృద్ధికి దోహదం చేసిన వారు అవుతారన్నారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు పలువురికి స్ఫూర్తిని ఇవ్వాలన్నారు. అనంతరం బిసి రాజారెడ్డి అభిమానులు ఆయనకు జ్ఞాపకం అందజేసి శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. అనంతరం అంధులకు , వారితో పాటు వచ్చిన సహాయకులకు భోజనం వసతి కల్పించి బిసి రాజారెడ్డి స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో బొబ్బల మహేశ్వర్ రెడ్డి రోటరీ క్లబ్ మెంబర్ బలరామయ్య భరతుడు పాల్గొన్నారు.

## మద్దయ్య యాదవ్ ను సన్మానించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



**బనగానపల్లె=అక్టోబర్=04 ప్రజాజ్యోతి** బనగానపల్లె, అక్టోబర్ 4 బనగానపల్లె పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన జి మద్దయ్య యాదవ్ ను రాష్ట్ర రోడ్లు భవనాలు పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నంద్యాల జిల్లాకు మొదటిసారిగా బనగానపల్లెకు చెందిన జి.మద్దయ్య యాదవ్ జిల్లా అధ్యక్షులుగా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు జి. నరసింహారెడ్డి ,జిల్లా సహాయ కార్యదర్శి ఎం. రామచంద్రారెడ్డి, ఏపీ బీజేపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి జవహర్ ఉపాధ్యక్షులుగా ఎస్ షాషావలి, బనగానపల్లె మండల అధ్యక్షులు చంద్రశేఖర్ ఉపాధ్యక్షులు మధు, వై.రఘురామిరెడ్డి, నాయకులు ఓబులేసు, నగేష్ ,మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# మోకాళ్లపై నిలబడి వీఆర్‌ఏల వినూత్న నిరసన

**బనగానపల్లెలో 19వ రోజుకు చేరిన నిరవధిక ధర్నా**

**-- సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి వీఆర్ఏల విజ్ఞప్తి**

**బనగానపల్లె=అక్టోబర్=04 ప్రజాజ్యోతి బనగానపల్లె:** నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలో గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏలు) తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సహాయ నిరాకరణ ఉద్యమం ఆదివారం 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బనగానపల్లె ఎంఆర్ ఓ కార్యాలయం ఎదుట వీఆర్ఏలు మోకాళ్లపై నిలబడి వినూత్న రీతిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ వీఆర్ఏ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ ఆందోళనలో భాగంగా వీఆర్ఏలు తమ దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ తరహాలో వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వారందరికీ ఒకేసారి ఉద్యోగ నియామకాలు కల్పించాలని, అర్హులైన వీఆర్ఏలకు 70 శాతం ప్రమోషన్లు కల్పించాలని, మరణించిన వీఆర్ఏల కుటుంబ సభ్యులకు వయోపరిమితి లేకుండా ఉద్యోగాలు కల్పించాలని కోరారు. 19 రోజులుగా వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన స్పందన రాకపోవడంపై వీఆర్ఏలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ అనేక కీలక విధులు నిర్వహిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, వీఆర్ఏల కుటుంబాలకు న్యాయం చేయాలని వారు కోరారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఐక్యంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని వీఆర్ఏలు స్పష్టం చేశారు.



# కూటమి పాలనకు కాలం దగ్గరపడింది.. వచ్చేది వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వమే!

**ఆగిన గండికోట-- వెలిగల్లు పనులు.. అధికారంలోకి రాగానే పరుగులు పెట్టిస్తాం!**

**హామీలు ఏమయ్యాయి చంద్రబాబూ..?**

**ఒక్క కొత్త పెన్షన్ ఇచ్చారా.. ఒక్క పక్కా ఇల్లు మంజూరు చేశారా?మహిళలకు రూ.1,500.. నిరుద్యోగులకు రూ.3 వేల భృతి ఏమైంది?**

**చంద్రబాబు వాటర్‌మ్యాన్' కాదు.. కరవుకు బ్రాండ్ అంబాసిడర్ బెదిరింపులకు భయపడేది లేదు.. మా తడాఖా ఏంటో చూపిస్తాం..**

**పార్టీ కార్యకర్తలు, నాయకులను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం...స్థానిక ఎన్నికలలో అన్ని స్థానాల్లో వైఎస్ఆర్ సిపి జెండా ఎగరాలి...**

గాలివీడులో జరిగిన గాలివీడు మండలంలో వైఎస్ఆర్ సిపి లో వివిధ హోదాలలో పదవులు పొందిన వారికి గుర్తింపు కార్డుల పంపిణీ లో పాల్గొన్న పార్లమెంట్ సభ్యుడు పివి మిథున్ రెడ్డి, వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి గండి కోట--వెలిగల్లు నీటి ప్రాజెక్టు పనులను కూటమి ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిపివేసిందని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందిస్తామని రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి అన్నారు. గాలివీడు మండలంలో వైఎస్ఆర్‌సీపీలో వివిధ హోదాల్లో బాధ్యతలు పొందిన వారికి గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిథున్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో నే వాటర్‌గ్రిడ్ పనులకు సగం నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అప్పటి ప్రభుత్వమే పులివెందుల, రాయచోటి నియోజకవర్గాల ను మోడల్ ప్రాజెక్టులుగా ఎంపిక చేసి అభివృద్ధికి బాటలు వేసిందన్నారు. ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన పనులను ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిలిపివేయడం దురదృష్టకరమన్నారు.

**రాయచోటి నియోజక వర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిది**

2024 ఎంపీ ఎన్నికల్లో తనకు లభించిన మెజారిటీలో సగం రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గం నుంచే వచ్చిందని మిథున్‌రెడ్డి గుర్తుచేశారు. రాయచోటి ప్రాంత ప్రజలు, వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు, నాయకులు తనపై చూపిన ఆదరణ, అభిమానాన్ని జీవితాంతం మరచిపోలేనని, వారికి ఎల్లవేళలా రుణపడి ఉంటానని అన్నారు. ఇక రెండేళ్లే.. తర్వాత వైఎస్ఆర్‌సీపీదే అధికారం కూటమి ప్రభుత్వ పాలనకు ఇక రెండేళ్ల కాలమే ఉందని మిథున్‌రెడ్డి అన్నారు. ఆ తర్వాత రాష్ట్రంలో వచ్చేది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకుల బెదిరింపులు, దౌర్జన్యాలకు వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు.. మా తడాఖా ఏంటో రానున్న రోజుల్లో చూపిస్తాం అని స్పష్టం చేశారు. మాజీ ఎంఎల్ఏ గడికోట శ్రీకాంత్‌రెడ్డి రానున్న రోజుల్లో బలమైన రాష్ట్ర నాయకుడిగా ఎదుగుతారని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి వైఎస్ఆర్‌సీపీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు వైఎస్ఆర్‌సీపీ శ్రేణులకు కీలకమని, ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ సత్తా చాటాలని ఆయన సూచించారు. ప్రజల అండతో స్థానిక ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ ఘన విజయాన్ని సాధించేలా ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని మిథున్‌రెడ్డి పిలుపునిచ్చారు.

**గాలివీడులో కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తిన శ్రీకాంత్‌రెడ్డి**

**కార్యకర్తల జోలికొస్తే సహించేది లేదని హెచ్చరిక**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా.. అన్నీ నెరవేర్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గొప్పలు చెప్పుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ముప్పై నెలలు గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ మేరకు అమలు చేశారో చంద్రబాబు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గాలివీడులో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఒక్క కొత్త పెన్షన్ ఇచ్చారా..? ఒక్క కొత్త పక్కా భవనం మంజూరు చేశారా..? మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామన్న హామీ ఏమైంది..? 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ ఇస్తామన్న మాట ఏమైంది..? నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఏమైంది..? అంటూ వరుస ప్రశ్నలతో కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. కరవుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు రాష్ట్రంలో వర్షాలు లేక రైతాంగం తీవ్ర కరవు పరిస్థితులను ఎదుర్కొంటున్నా ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైందని శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. పంటలు చేతికొచ్చే పరిస్థితి లేక.. మరోవైపు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించక రైతులు నష్టాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు వాటర్‌మ్యాన్ కాదు.. కరవుకు బ్రాండ్ అంబాసిడర్ అని శ్రీకాంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. మదనపల్లె సమావేశంలో హార్టీకల్చర్ హబ్‌కు రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రకటించిన చంద్రబాబు.. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన అభివృద్ధిని తన ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. హార్టీకల్చర్‌కు బాటలు వేసింది వైఎస్సార్ హార్టీకల్చర్, డ్రిప్ ఇరిగేషన్, వెలిగల్లు ప్రాజెక్టు తదితర అనేక అభివృద్ధి కార్యక్రమాలకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే బలమైన పునాది పడిందని శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. హంద్రీ--నీవా, హార్టీకల్చర్‌కు తానే బ్రాండ్ అంబాసిడర్‌నని చెప్పుకునే ముందు.. రైతుల ప్రస్తుత పరిస్థితిని చంద్రబాబు పరిశీలించాలని సూచించారు. రైతులు కరవుతో అల్లాడుతుంటే.. ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకే పరిమితమవుతోందని విమర్శించారు. గండికోట--వెలిగల్లు నీటి పథకాన్ని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం జరుగుతున్న వాటర్‌గ్రిడ్ పనులకు తమ ప్రభుత్వ హయాంలోనే మంజూరులు జరిగాయని స్పష్టం చేశారు. ధరల భారంతో పేదల నడ్డి విరుస్తున్నారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర సరుకులు, పెట్రోల్, గ్యాస్ ధరలు పెరిగి సామాన్యుడి జీవితం భారంగా మారిందని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఒకవైపు ధరల భారం.. మరోవైపు హామీల అమలులో జాప్యం.. ఇంకోవైపు రైతుల కష్టాలు.. ఇలా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి చంద్రబాబు రాజకీయంగా దగ్గరగా ఉంటున్నారని శ్రీకాంత్‌రెడ్డి



ఆరోపించారు. దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యకర్తల జోలికొస్తే ఊరుకునేది లేదు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యాలు, బెదిరింపులు, అక్రమ కేసులు, అధికార బలంతో వేధింపులు కొనసాగుతున్నాయని శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. పోలీసుల సహకారంతో కూటమి నేతలు చేస్తున్న రాజకీయ వేధింపులను తాము గమనిస్తున్నామని అన్నారు. నా 18 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ ఎవ్వరినీ చెడుగా మాట్లాడలేదు. అది మా పెద్దలు నేర్పిన సంస్కారం. కానీ మా పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్యాడర్ జోలికి వస్తే మాత్రం సహించేది లేదు" అని స్పష్టం చేశారు. అధికారం కోసం కాదు.. కార్యకర్తల కోసం పనిచేస్తాం. అధికారంలో ఉన్నా లేకపోయినా పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తాం" అని శ్రీకాంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో చట్టం చేయాలి బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై చంద్రబాబు మాట్లాడుతున్నారని పేర్కొన్న శ్రీకాంత్‌రెడ్డి.. బీసీలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. బీసీలను మాటలతో కాకుండా చట్టపరమైన చర్యలతో ఆదుకోవాలని కోరారు. కార్యకర్తల సంక్షేమమే మా బాధ్యత అధికారం లేని సమయంలోనూ వైఎస్సార్‌సీపీపై నమ్మకంతో, అభిమానంతో పార్టీ కోసం నిలబడుతున్న ప్రతి కార్యకర్తకు తాము అండగా ఉంటామని అన్నారు. పార్టీ బలోపేతంతో పాటు క్యాడర్ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. పార్టీ గుర్తింపు కార్డులు పొందిన కార్యకర్తల్లో ఎవరైనా ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని పార్టీ అధినేత వైఎస్ జగన్ తన సొంత నిధుల నుంచి అందిస్తారని శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. పార్టీ కార్యకర్తల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ అధినేత ఇస్తున్న ప్రాధాన్యానికి ఇది నిదర్శనమన్నారు. స్థానిక ఎన్నికలకు శ్రేణులు సిద్ధం కావాలి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి కార్యకర్త సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి, నాయకులు--కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని కోరారు. అధికారం లేకపోయినా పార్టీ కోసం నిలిచిన కార్యకర్తల రుణం తీర్చుకోవడమే తన లక్ష్యమని.. అభివృద్ధితో పాటు పార్టీ క్యాడర్ సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## వెంగళంపల్లిలో టీడీపీ నేత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

**(ప్రజాజ్యోతి న్యూస్) ప్యాపిలి అక్టోబర్ 4** ప్యాపిలి మండలం వెంగళంపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పుట్ట రామకృష్ణ గారి తండ్రి గారి మృతి పట్ల డోన్ మాజీ ఎమ్మెల్యే శ్రీమతి కోట్ల సుజాతమ్మ గారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె వెంగళంపల్లిలోని వారి నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని, మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని ఆమె ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ నిధుల్లో గోల్ మాల్

**30 లక్షల పైగా దారి బినామీ ఖాతాల్లో కి దారి మళ్లింపు**

**గాలివీడు అక్టోబర్ 04 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలో ఉపాధి హామీ నిధుల్లో జరిగిన గోల్ మాల్ పై విచారణ ప్రారంభమైంది. 2018 – 19 అప్పటి టీడీపీ ప్రభుత్వం లో ఈ పథకం కింద చెక్ డ్యాములు,డంపింగ్ యార్డులు, ప్లాంటేషన్లు వంటి పనులు చేపట్టారు. ఆ సమయంలో కొంత మేర నిధులను విడుదల చేసి మిగతా నిలిపేశారు .2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం పెండింగ్ నిధులను 2024 వరకు విడుదల చేయలేదు. 2004లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం పెండింగ్ బిల్లులను 2025 ఆగస్టు లో విడుదల చేసింది. దాదాపు అన్ని పంచాయతీల్లో రూ.50 లక్షల పైగా విత్ హెల్డ్ నిధులు విడుదల చేసింది. అయితే ఆ నిధులను ఉపాధి సిబ్బంది రైతులకు ఇవ్వకుండా తమ సొంత ఖాతాలోకి మళ్లించినట్లు తెలుస్తోంది. 30 లక్షల పైగా కాజేసినట్లు తెలుస్తుంది. ఏపీవో సహకారంతో కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు బినామీ పేర్ల మీద 20 వేల నుంచి 2 లక్షల వరకు ఖాతాల్లో జమ చేశారని ఆరోపణలు ఉన్నాయి. శనివారం ఇద్దరూ ఎస్ ఆర్ పి లు ఒక స్టేట్ మానిటర్ ఉపాధి కార్యాలయానికి చేరుకొని సమాచారాన్ని సేకరిస్తున్నారు.




## శ్రీ కోదండరామ స్వామి దేవాలయంలో రేపు వరుణ యాగం మరియు వరుణ జపం



**గుంతకల్లు అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని శ్రీ కోదండ రామ స్వామి దేవాలయంలో రేపు మంగళవారం రాష్ట్రంలో, దేశంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురువాలని, ప్రజల సంక్షేమం మరియు శ్రేయస్సు కొరకు వరుణ దేవుని ఆశీస్సులు పొందుటకుగాను వరుణ యాగం మరియు వరుణ జపం కార్యక్రమములు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి, ధర్మకర్తల మండలి అధ్యక్షులు మరియు ధర్మకర్త మండలి సభ్యులు తెలిపారు. కావున యావన్మంది భక్తాదులు మరియు రైతు సోదరులు ఈ కార్యక్రమముల యందు పాల్గొనవలసినదిగా వారు తెలిపారు.

## సీఎం పర్యటనకు పటిష్ట భద్రతా చర్యలు

**క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ వకుల్ జిందాల్**



**తెనాలి అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం తెనాలి రూరల్ మండలం బుర్రిపాలెంలో పర్యటించనున్న నేపథ్యంలో గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ క్షేత్రస్థాయిలో పర్యటించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ముఖ్యమంత్రి పాల్గొనే నూతన గృహ నిర్మాణ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమం నేపథ్యంలో పోలీస్ అధికారులు, సిబ్బందికి భద్రతా విధులపై పలు సూచనలు చేశారు. కార్యక్రమ ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, ప్రవేశ,నిష్క్రమణ మార్గాలు, వీఐపీ రూట్, కాన్వాయ్ మార్గాల్లో పటిష్టమైన నిఘా కొనసాగించాలని ఎస్పీ ఆదేశించారు. విధులు కేటాయించిన ప్రతి సిబ్బంది తమ బాధ్యతలపై పూర్తి అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని, అనుమతి లేకుండా విధులు నిర్వహిస్తున్న ప్రాంతాన్ని విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ రాకపోకల సమయంలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల రాకపోకలను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా కార్యక్రమ ప్రాంగణం, పరిసర ప్రాంతాలు, కాన్వాయ్ మార్గంపై నిరంతరం నిఘా ఉంచాలని, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్ సిబ్బంది కెమెరాల ద్వారా అందే సమాచారాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన సమాచారాన్ని బందోబస్తు సిబ్బందికి చేరవేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు, ప్రత్యామ్నాయ మార్గాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, భద్రతకు ఎలాంటి విఘాతం లేకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సమీక్షలో అదనపు ఎస్పీలు ఏటీవీ రవికుమార్, రమణమూర్తి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, తెనాలి డీఎస్పీ, తెనాలి రూరల్ సీఐ నాయబ్ రసూల్‌తో పాటు పలువురు పోలీస్ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో వీఆర్వో మృతి

**నందవరం, అక్టోబర్ 04 (ప్రజా జ్యోతి):**నందవరం తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న ముగతి గ్రామ నతానియల్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. హాలహర్వి గ్రామ వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం మృతి చెందారు. ఆయన ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, తోటి ఉద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పలువురు అధికారులు, సిబ్బంది నతానియల్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు.



# చొప్పెల్ల శ్రీ మదనగోపాల స్వామివారి ఆలయంలో వేదపారాయణదారుగా ఓలేటి సాయి త్రినాధ్ శర్మ.

**ఆలమూరు, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి):** చిన్న వయసులోనే వేద విద్యలో ప్రావీణ్యం.. ఆలమూరు మండలంలో ఏకైక వేదపండితుడిగా గుర్తింపు. వేద విద్యపై చిన్ననాటి నుంచే ఆసక్తి పెంచుకుని, కఠోర నియమ నిబంధనలతో వేదాధ్యయనం సాగించిన ఓలేటి సాయి త్రినాధ్ శర్మ ప్రస్తుతం వేదపండితుడిగా సేవలందిస్తున్నారు. ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామానికి చెందిన డాక్టర్ ఓలేటి నారాయణరావు కుమారుడైన సాయి త్రినాధ్ శర్మ.. తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వంతో వేద విద్యలో విశేష ప్రతిభ కనబరిచారు.

**టీటీడీ వేద విజ్ఞాన పీఠంలో అధర్వణ వేద అధ్యయనం**

2003 నవంబర్‌లో జన్మించిన సాయి త్రినాధ్ శర్మ తన ప్రాథమిక విద్యను చెముడులంకలోని నేతాజీ స్కూల్‌లో 5వ తరగతి వరకు అభ్యసించారు. అనంతరం 2015 నుంచి 2022 వరకు తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) ఆధ్వర్యంలోని వేద విజ్ఞాన పీఠంలో అధర్వణ వేదాన్ని క్రమాంతం వరకు అభ్యసించి ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. వేద విద్యతో పాటు వేద శాస్త్రాల్లోనూ ఆయన ప్రతిభను చాటుకున్నారు. విశాఖపట్నం, కాకినాడ, విజయ వాడ, సరిపల్లె, రావులపాలెం తదితర ప్రాంతాల్లో నిర్వహించిన వేద శాస్త్ర పరీక్షల్లో పాల్గొని పట్టాలు పొందారు. దీంతో ఆలమూరు మండలంలో వేద విద్యను అభ్యసించి, ప్రస్తుతం వేద పారాయణ సేవలు అందిస్తున్న ఏకైక వేదపండితుడిగా సాయి త్రినాధ్ శర్మ గుర్తింపు పొందుతున్నారు.

**మందపల్లి ఆలయంలో సేవలకు అవకాశం**

2025 జూలైలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని మందపల్లి శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానంలో తాత్కాలిక వేదపారాయణదారుగా విధులు నిర్వహించే అవకాశం ఆయనకు లభించింది. అనంతరం టీటీడీ నిర్వహించిన వేదపారాయణ పోస్టుల ఎంపిక పోటీలోనూ సాయి త్రినాధ్ శర్మ ఉత్తీర్ణత సాధించారు.

**స్వగ్రామ ఆలయంలో వేదపారాయణ సేవలు**

ఈ క్రమంలో గత సెప్టెంబర్ 13న తన స్వగ్రామమైన చొప్పెల్లలోని శ్రీ మదనగోపాల స్వామి వారి దేవస్థానంలో టీటీడీ ఆధ్వర్యంలో వేదపారాయణదారుగా సాయి త్రినాధ్ శర్మ నియమితులయ్యారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మద్దూరి శివరామకృష్ణ నుండి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ప్రతిరోజూ ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట ఆలయంలో వేదపారాయణం నిర్వహిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక సేవలు అందిస్తున్నారు.

**యువతకు ఆదర్శంగా..**



చిన్న వయసులోనే వేద విద్యను అభ్యసించి, కఠోర నియమ నిబంధనలను పాటిస్తూ వేద పారాయణంలో నైపుణ్యం సాధించిన సాయి త్రినాధ్ శర్మ.. తన స్వగ్రామంలో వేద సంస్కృతిని కొనసాగిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వంతో వేద విద్యలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని గ్రామస్థులు ఆకాంక్షిస్తున్నారు. వేద విద్యను పరిరక్షిస్తూ ఆలయాల్లో వేదపారాయణ సేవలు అందిస్తున్న డాక్టర్ ఓలేటి నారాయణరావు తనయుడు సాయి త్రినాధ్ శర్మకు గ్రామస్థులు, భక్తులు అభినందనలు తెలియజేస్తున్నారు.

# నిర్వాసితులకు అన్యాయం జరిగితే!...








**ప్రజల్లోంచి మరో సున్నం రాజయ్య ,కుంజా బొజ్జి,కారం శిరమయ్య, పూనెం సత్యనారాయణ, పుట్టుకొస్తారు!..**

**మేంపోరాటం చేస్తాం!..**

**మీసపోర్టు మాకు కావాలి!..**

**పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తునపో రాటం చేస్తాం!..**

**సి.పి.ఎం,పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు!..**

**లోకనాదం!..**

**వరరామచంద్రాపురం, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** పోలవరం నిర్వాసితులకు అన్యాయం చేయాలని చూస్తే ప్రజల్లోంచి, సున్నం రాజయ్య, కుంజా బొజ్జి, కారం శిరమయ్య, పూనెం సత్యనారాయణ లు పుట్టుకొస్తారని, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పోలవరం, నిర్వాసితుల కున్యాయం జరిగే వరకు అలుపు లేకుండా సి.పి.ఎం, పార్టీ, పోరాటం చేస్తుందని, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలను మెడలు వంచైనా న్యాయం చేసేదిశగా పోరాడుదాంమని, సి.పి.ఎం, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం, స్పష్టం చేశారు. ఆదివారం, వరరామచంద్రాపురం, రాజుపేట, వడ్డిగూడెం, రేఖపల్లి, మీదుగా మోటార్ బైక్ ర్యాలీ జరిగింది.అడుగుడుగున, సి.పి.ఎం, మోటార్ బైక్ ర్యాలీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు.ఏజెన్సీ గ్రామాల్లో కనీవినీ ఎరుగని రీతిలో ప్రజాదరణ లభించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలవరం నిర్వాసితుల సమస్యల కోసం గిరిజన స్త్రరైతుల పోడు భూముల పట్టాల కోసం, సి.పి.ఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, ఒకటవ తారీఖున ఎటపాక, మండలం కన్నాయిగూడెం, గ్రామంలో ప్రారంభించి నటువంటి బైక్ యాత్ర ఆదివారం వరరామచంద్రాపురం, మండలానికి చేరిందని పేర్కొన్నారు. ఈ యాత్రకు అడుగడుగు న జనాల నీరాజనాలమధ్య ఎంతో శోభయమానంగా యాత్ర జరగడం ఈయాత్రలో వందలాదిమందిగా సి.పి.ఎం, పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజలు పాల్గొని విజయవంతం చేశారని, ఈ అద్భుతమైన కార్యక్రమానికి, సి.పి.ఎం,పార్టీ శ్రీకారం చుట్టిందని, వివరించారు. 18సంవత్సరాల నిండిన యువతీ యువకులకు కటాఫ్ డేట్ తో సంబంధం లేకుండా కాళీ చేసే నాటికి ప్రతి ఒక్కరికి నష్టపరిహారం చెల్లించాలని, డిమాండ్ చేశారు. అన్నవరం వాగుపై ఐ లెవెల్ బ్రిడ్జి (వంతెన) కట్టించాలని.పోడు భూములకు హొక్కు పత్రాలు ఇవ్వాలని పెద్దమటపల్లి నుండి నర్సింగ్ పేట,రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు.ఏడు సంవత్సరాలక్రితం రోడ్డుతవ్వి వదిలేసారని తక్షణమే ఆ రహదారి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

**పోలవరం,ప్రాజెక్టువల్ల నష్టపోయిన చుట్టచివరి నిర్వాసితుడి కోసం సి.పి.ఎం,పార్టీ ఓన్ చేసుకొని పోరాటం చేస్తుంది!...**

పోలవరం ప్రాజెక్టు వల్ల నష్టపోయిన నిర్వాసితులలో చిట్టచివరి నిర్వాసితులకు అన్యాయం జరిగినా మేము సహించేది లేదని సి.పి.ఎం,పార్టీ ఎన్నో పోరాటాలు చేసి ఈరోజు నిర్వాసితులకు న్యాయం చేసిందని ఇక ముందు కూడా సిపిఎం పార్టీ నిర్వాసితులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని,సి.పి.ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కార్యదర్శివర్గ సభ్యులు లోత రామారావు, చెప్పారు. ఈ ప్రాంతంలో ఎన్నో పోరాటాలు చేసి ఈప్రాంతాన్ని అభివృద్ధి చేసినటువంటి మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ కుంజా బుజ్జి, కామ్రేడ్ సున్నం రాజయ్య,లాంటి గొప్ప నాయకుల లక్ష్యాల కోసం మాప్రాణాలు త్యాగాలకైనా వెనకాడ బోమని పేర్కొన్నారు. నిర్వాసితుల కోసం వారు చేసిన పోరాటం అలుపెరగనిదని ఈ రోజు నిర్వాసితులకి ఎంతో కొంతన్యాయం జరిగిందంటే వారుచేసిన పోరాటాల ఫలితం మేనని ఆయన గుర్తుచేశారు. వారి పోరాట స్ఫూర్తితో మరెన్నో ఉద్యమాలుచేసి ఈప్రాంత ప్రజలకు పోలవరంనిర్వాసితులకు న్యాయంచేసే అంతవరకు మా ఎర్రజెండా పోరాటం ఆపదని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు.నిర్వాసితులకు అన్యాయం జరిగితే ప్రజల్లోంచి ఒక కుంజా బొజ్జి,ఒక సున్నం రాజయ్య ,ఒక కారం శిరమయ్య, పూనెం సత్యనారాయణ, పుట్టుకొస్తారని హెచ్చరించారు. సి.పి.ఎం, పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ!..పోలవరం నిర్వాసితులకు అడుగడుగునా అన్యాయమే జరిగిందని పనికిమాలిన సర్వేలుచేసి, అధికారుల ప్రజల జీవితాలతో చెగాటం ఆడుతున్నారని, నిజమైన నిర్వాసితులను గుర్తించడంలో విఫలమయ్యారని సి.పి.ఎం,పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, ధ్వజమెత్తారు. పొలాలు రహదారులు మునిగిపోతున్న కూడా కొన్ని గ్రామాలు నేటికీ సర్వేలో లేకుండా ఉన్నాయంటే వారి లైడార్ సర్వేలు ఎంత వాస్తవముంపుని, చూపుతున్నాయో గమనించాలని చెప్పా రు. అటువంటి గ్రామాలను కూడా ఈ ప్రభుత్వ అధికారులు ప్రభుత్వాలు గుర్తించకపోవడం దౌర్భాగ్యంమని ఈపేద ప్రజల కు అండగా సి.పి.ఎం,పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని నిర్వాసితులకు అన్యాయం చేస్తే సహించబోమని హెచ్చరించారు

**మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్,మాట్లాడుతూ!..**

మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, మాట్లాడుతూ మండలంలోని నిర్వాసితులను ఎన్నివిధాలుగా ఇబ్బందులకు గురిచేయాలో అన్ని విధాలుగా ఈఅధికారుల గురి చేస్తున్నారని చాలామంది నిర్వాసితులకు ఇంతవరకు ప్యాకేజీ కూడా పడలేదని వాటి కోసం ఐ.టీ.డీ.ఏ, చుట్టూ తిరిగి, తిరిగి, వారిచెప్పులు, అరిగిపోతున్నాయి తప్ప నిర్వాసితులకు న్యాయం జరగడం లేదని, పైసలు ఇస్తే ఫైలు కదులుతుందని లేదంటే కదిలే పరిస్థితి లేదని, ఆరోపించారు. ఈ అధికారులు నిర్వాసితులను నిలువునా దోపిడీ చేస్తున్నారని అర్హులైనట ువంటి, నిర్వాసితులను కూడా ఆర్"అండ్"ఆర్, జాబితాలో చేర్చకుండా ఎవరైతే డబ్బులు ఇస్తారో వారి పేర్లు అక్రమంగా చేర్చి అక్రమాలకు ఈ అధికారులు పాల్పడుతున్నారని, చెప్పి ఇటువంటి విధానాన్ని అధికారులు మానుకోకపోతే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం, రాష్ట్ర గిరిజన సంఘం నాయకులు లోతా రామారావు, పోలవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్,జిల్లా కార్యవర్గ సభ్యులు సున్నం. రాజులు, సోయం చినబాబు, సాయం సీతారామయ్య ఎం.పీ.పీ కారం లక్ష్మి,మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, కూనవరం మండల కార్యదర్శి బాబు బారయ్య ఎంపీటీసీ ప్రదీప్,మండల కార్యవర్గ సభ్యులు పంకు. సత్తి బాబు, కారం సుందరయ్య కమిటీ సభ్యులు పొడియం శ్రీరామమూర్తి, లక్ష్మణ్, బాబురావు, బొజ్జి, తాతబాబు, సత్తిబాబు, వడ్లది రమేష్, రంగమ్మ, సత్యనారాయణ, పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## కింతలి శ్మశాన వాటికకు కట్టెలు వితరణ

**- అంత్యక్రియలకు ఇబ్బందులు లేకుండా సహాయం**

**- తుఫాన్‌కు నేలకొరిగిన చెట్లను వినియోగంలోకి తీసుకొచ్చిన కూటికుప్పల వెంకట అప్పలనాయుడు**

**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:** పొందూరు మండలం కింతలి గ్రామంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించేందుకు అవసరమైన కట్టెలు అందుబాటులో లేకపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన కూటికుప్పల వెంకట అప్పలనాయుడు దహన సంస్కారాలకు అవసరమైన కట్టెలను అందజేసి తన వంతు సహాయం అందించారు.ఇటీవల తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన చెట్లను సేకరించి, వాటిని దహన సంస్కారాలకు అనుకూలంగా చిన్న చిన్న ముక్కలుగా కొట్టించారు. అనంతరం ట్రాక్టర్ ద్వారా వాటిని కింతలి శ్మశాన వాటికకు తరలించారు. ఈ కట్టెలు ఆరిన అనంతరం దహన సంస్కారాలకు వినియోగించుకోవచ్చని వెంకట అప్పలనాయుడు తెలిపారు.అంత్యక్రియల సమయంలో కట్టెల కోసం ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఈ సహాయం ఎంతగానో



ఉపయోగపడుతుందని గ్రామస్థులు తెలిపారు. సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి కట్టెలను సమకూర్చిన వెంకట అప్పలనాయుడిని గ్రామ పెద్దలు, యువత అభినందించారు.ఈ కార్యక్రమంలో కింతలి గ్రామ ఎంపీటీసీ కూటికుప్పల హనుమంతురావు, మాజీ సర్పంచ్ దవళ గణపతిరావు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

## పెనికేరులో రూ.47 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.



**ఆలమూరు, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి):** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఆదివారం ఆలమూరు మండలం పెనికేరు గ్రామంలో రూ.47 లక్షల విలువైన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి, పూర్తయిన పనులను ప్రారంభించారు. ఓఎన్జీసీ,సీఆర్‌సీ నిధులు రూ.14 లక్షలతో నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. అలాగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఉపాధి హామీ) నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, మండల ప్రజా పరిషత్ నిధులు రూ.8 లక్షలతో నిర్మించిన మరో రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఈదర చినబాబు, వంటిపల్లి పాపారావు, గొడవర్తి భాస్కరరావు, కోన దత్తుడు, ఈదల సత్తిబాబు, మెర్ల గోపాలస్వామి, కప్పల సునీల్ కుమార్, కొమ్ము నారాయుడు, ఎంపీడీఓ ఏ. రాజు, సంబంధిత శాఖల అధికారులు,కూటమి నాయకులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఖాసిం వల్లికి ఆచార్యదేవోభవ పురస్కారం ప్రధానం



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి)** బద్వేల్ నియోజకవర్గం కాశి నాయన మండలంలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల, బాలాయ పల్లె నందు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఖాసిం వల్లికి ఆదివారం కలసపాడు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో "వివేకానంద సేవా ట్రస్ట్, ఓబులాపురం వారు ఆచార్యదేవోభవ పురస్కారం అందించారు. ఈ పురస్కారం స్వామి వివేకానంద సేవాశ్రమం ట్రస్ట్ వ్యవస్థాపకులు పాపి జెన్ని రామకృష్ణారెడ్డి,కలసపాడు ఎం.పీ.డీ.వో మహబూబ్ బీ,విశ్రాంత డిప్యూటీ డి.ఎం.హెచ్. ఓ డాక్టర్ మార్కా రెడ్డి చేతుల మీదుగా ప్రధానం జరిగింది. విద్య,సామాజిక రంగాలలో ఖాసిం వల్లి చేస్తున్న కృషిని గుర్తించి ఖాసిం వల్లి కి ఈ అవార్డు ప్రధానం చేయడం జరిగింది. ఈ అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందని ఖాసీం వల్లి అన్నారు. ఖాసీం వల్లికి పురస్కారం అందడంతో బాలాయపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లా దస్తగిరి బాబు, గ్రామస్తులు,మండల విద్యాధికారులు మహమ్మద్ షఫీ, నిర్మల, లైబ్రరియన్ పఠాన్ అఫ్రిది, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## బాపట్లలో పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్ భవనాల ప్రారంభం

**10, కోట్ల రూపాయలతో ఆధునిక వసతులు.**

**రైతుల ఆదాయం పెంపే లక్ష్యంగా పరిశోధనలు**



**బాపట్ల అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్‌లో నిర్మించిన ఆధునిక భవన సముదాయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చన్నాయుడు సోమవారం ప్రారంభించనున్నారు. ఇదే సందర్భంగా బాపట్ల వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం చేపట్టిన ఇన్నోవేటివ్ ఫార్మర్స్ నెట్‌వర్క్ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నారు. 1981లో స్థాపించబడిన ఈ కేంద్రానికి కేంద్ర ప్రభుత్వం ఆర్,కె,వి,వై, ఆర్,ఏ,ఎఫ్,టి,ఏ,ఆర్ పథకం కింద,4.70 కోట్ల రూపాయలతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భవనం,1.40 కోట్ల రూపాయలతో వర్క్‌షాప్, శిక్షణా కేంద్ర భవనాలను నిర్మించింది. మొత్తం 6.10 కోట్ల రూపాయలతో ఆధునిక వసతులు అందుబాటులోకి వచ్చాయి.పంట కోత అనంతరం జరిగే నష్టాలను తగ్గించడం, నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా ఈ కేంద్రం పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. మిల్లెట్ల సెంట్రిఫ్యూగల్ డీహల్లర్, పసుపులో కర్కుమిన్ గుర్తించే రాపిడ్ టెస్ట్ కిట్, వేరుశెనగల మైక్రోక్లైమేట్ కంట్రోల్ స్టోరేజ్ బిన్, (ఐఓటి) ఆధారిత ఆహార పదార్థాల చెడిపోవడాన్ని గుర్తించే కిట్, వరి డ్రైయర్, సోలార్ పాలీహౌస్ డ్రైయర్, పసుపు బాయిలర్, పాలిషర్ తదితర సాంకేతికతలను అభివృద్ధి చేసింది.మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఉపయోగపడేలా అన్నంలోని గ్లైసెమిక్ ఇండెక్స్‌ను తగ్గించేందుకు రూపొందించిన అగ్రోబ్లైట్ (డయాబ్లైట్) స్మార్ట్ రైస్ కుక్కర్ కూడా కేంద్రం ముఖ్యమైన ఆవిష్కరణల్లో ఒకటిగా నిలిచింది. ఇప్పటివరకు మూడు పేటెంట్లు పొందగా, మరో ఐదు పేటెంట్ దరఖాస్తులు దాఖలు చేసింది.కేంద్రంలోని పరిశోధన ఫలితాలను రైతుల క్షేత్రస్థాయికి వేగంగా చేరవేయడమే లక్ష్యంగా ఇన్నోవేటివ్ ఫార్మర్స్ నెట్‌వర్క్ ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులు, విద్యార్థులు, పరిశోధకులు, వ్యవసాయ పారిశ్రామిక వేత్తలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా జరిగిన పాత్రికేయుల సమావేశంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. పాలడుగు వి. సత్యనారాయణ, పరిశోధన సంచాలకులు డా. వి. సుమతి, సహ పరిశోధన సంచాలకులు డా. ఎన్.వి.వి.ఎస్. దుర్గాప్రసాద్, అగ్రి ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డా. ఎం.ఎస్. బైగ్, పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్ హెడ్ డా. డి.డి. స్మిత్ పాల్గొన్నారు.

## అమ్మ...అంబులెన్స్ రాదా?



**:-కౌతాళం ప్రభుత్వ ఆసుపత్రిలో అంబులెన్స్ కొరత**

**కౌతాళం,అక్టోబర్ 04 ప్రజా జ్యోతి** కౌతాళం ప్రభుత్వ ఆసుపత్రికి పురిటి నొప్పులతో వచ్చిన గర్భిణీ స్త్రీకి అంబులెన్స్ కరువైంది. మెరుగైన వైద్యం కోసం ఆదోనికి రెఫర్ చేయగా,108 అంబులెన్స్ కోసం గంటల తరబడి ఎదురుచూసినా రాలేదు.బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆటోలో గర్భిణీని ఆదోని ఆసుపత్రికి తరలించారు. అత్యవసర సమయంలో 108 సేవలు అందకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యవసర సమయంలో అందాల్సిన అంబులెన్స్ అందకపోతే పేద ప్రజల పరిస్థితి ఏంటి అని ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఉన్నతాధి కారులు స్పందించి 108 సేవలను సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పోడూరులో మండల బీజేపీ సమావేశం.



**పోడూరు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. అక్టోబర్ 4.** పోడూరు మండల భారతీయ జనతా పార్టీ సమావేశం మండల బీజేపీ అధ్యక్షులు చింతపల్లి రమేష్ శెట్టి అధ్యక్షతన ఆదివారం పోడూరులో జరిగింది. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై ఈ సమావేశం లో చర్చించారు.?ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీదేవి జిల్లా ఇంచార్జ్ రేలంగి శ్రీదేవి , జిల్లా ప్రధాన కార్యదర్శి తోట గంగరాజు జక్కంపూడి కుమార్ బిజెపి మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## డాక్టర్ పవన్‌కుమార్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పర్వత ప్రసాద్



**కాకినాడ జిల్లా అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ఇటీవలే మాతృవియోగం చెందిన డాక్టర్ పవన్‌కుమార్‌ను ప్రత్తిపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పర్వత శ్రీ పూర్ణచంద్ర ప్రసాద్ పరామర్శించారు.ప్రత్తిపాడులోని డాక్టర్ పవన్‌కుమార్ నివాసానికి వెళ్లిన ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతురాలి మృతికి సంతాపం తెలిపారు.వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మామిడి నరసింహమూర్తి, మారిశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడలో ఘనంగా బీసీవై పార్టీ సమావేశం

**స్థానిక సంస్థల ఎన్నికలకు క్షేత్రస్థాయి నుంచి సమాయత్తం**

**శంఖవరం , అక్టోబర్ 4 (ప్రజాజ్యోతిన్యూస్ ):**భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై పార్టీ) రాష్ట్ర సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో కాకినాడ నగరంలోని జవహర్ స్ట్రీట్‌లోని వెంకీ రెసిడెన్సీలో నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యకర్తల సమావేశం ఘనంగా జరిగింది. పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం, ప్రజా సమస్యలపై పోరాట కార్యాచరణపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు.ఈ సందర్భంగా పిఠాపురం బీసీవై పార్టీ ఇన్‌చార్జి శీరం శ్రీను మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ సిద్ధాంతాలు, సామాజిక న్యాయం కోసం ఆయన చేస్తున్న ఉద్యమానికి ఆకర్షితులైన పలువురు యువకులు, మహిళలు, వివిధ వర్గాలకు చెందిన నాయకులు ఈ సందర్భంగా బీసీవై పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి నాయకులు సాదరంగా ఆహ్వానించారు.సమావేశానికి కాకినాడ జిల్లా బీసీవై పార్టీ ఇన్‌చార్జి రాయుడు నాగేశ్వరరావు, కర్రీ గోపాలకృష్ణ, రాయుడు సుధాకర్, గొంప శివకుమార్, గింజల రామకృష్ణ, మాలిపూడి రాజా, పీతల రాజా, మోరుకుర్తి శివ, జి.ఎన్. రాజు తదితరులు హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలతో పాటు మహిళా, యువజన, విద్యార్థి, సోషల్ మీడియా విభాగాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీవై పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి ప్రజల మద్దతుతో విజయపథంలో నడిపించాలని రాష్ట్ర సమన్వయ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు.



# అనుబంధాలు తగ్గుతున్నాయి....!! స్టేటస్ లు పెరుగుతున్నాయి...!!

**జి.కొండూరు :(అక్టోబర్ 10,ప్రజా జ్యోతి బ్యూరో )**
మీ ఫోన్ లో వెయ్యి కాంటాక్ట్స్ ఉండొచ్చు..!
వందల మంది ఫ్రెండ్స్ ఉండొచ్చు..!
వేల మంది ఫాలోవర్స్ ఉండొచ్చు..!
కానీ.. "అర్ధరాత్రి ఆపద వస్తే" నేనున్నా అని చెప్పగలిగే మనుషులు ఎంతమంది ఉన్నారు..?
ప్రతి రోజూ 'శుభోదయం' మెసేజీలు వంద వస్తాయి...కానీ 'ఎలా ఉన్నావ్..?' అని నిజంగా అడిగే మనిషి చాలా అరుదు.
ఎప్పుడు మనం బంధం అను కూడా లాభ నష్టాల లెక్కల్లో చూస్తున్నాం.
"వాళ్ళు మన ఇంటికి రాలేదు..మనం ఎందుకు వెళ్ళాలి..?"
"వాళ్ళు ఫోన్ చేయలేదు..మనం ఎందుకు చేయాలి..?"
ఇలా లెక్కలు వేసుకుంటూ.. మనుషులను ఒక్కొక్కరిని జీవితంలో నుంచి తీసేస్తున్నాం. ఒక్క సారి ఆలోచించండి. మన తాతలు, అమ్మమ్మలు చదివింది కొన్ని అక్షరాలు కాదు..కలిసిమెలిసి ఉండే సంస్కృతి. మన తల్లి తండ్రులు నేర్పింది పెద్ద ఇల్లు కట్టుకోవడం కాదు, మనుషులను కలుపుకొని వెళ్లడం. మరి మనం మన పిల్లలకు ఏమి నేర్పిస్తున్నాం..? "ఫస్ట్ రావాలి.." "ఎక్కువ సంపాదించాలి.." "అందరికంటే పైకి వెళ్ళాలి.." అని చెబుతున్నాం. కానీ.." ఎవరినీ బాధపెట్టొద్దు..చూడొద్దు.." "బంధాలను వదులుకోవద్దు.." "కష్టంలో ఉన్న వారికి తోడుగా నిలబడు.." అని ఎంతమంది మనము చెబుతున్నాం..? జీవితంలో ఒక నిజం ఉంది. మీ బ్యాంక్ బ్యాలెన్స్ మీ అంత్యక్రియలకు రాదు. మీ హోదా మీకు కన్నీరు పెట్టదు. మీ కారు మీకు ఓదార్పు చెప్పదు. మనుషులే వస్తారు.బంధాలే నిలుస్తాయి. ప్రేమే గుర్తుండి పోతుంది. ఈరోజు మనం ఎవరి కోసం






మాట్లాడకపోతే..రేపు మాట్లాడాలనుకున్నా వినే మనిషి ఉండకపోవచ్చు. ఈరోజు మనం బిజీ అని దూరం పెడితే..రేపు మన ఒంటరి తనాన్ని పంచుకునే భుజం దొరకకపోవచ్చు. ఒక్క సారి మీ ఫోన్ తీసుకోండి. నెలలుగా మాట్లాడని ఒక బంధువుకు కాల్ చేయండి. "ఎలా ఉన్నావ్..?" అని మాత్రమే అడగండి. మీరు మొదలుపెట్టిన ఆ ఒక్క మాట..ఒక విరిగిన బంధాన్ని మళ్ళీ కలుపుతుంది. మనం సోషల్ మీడియాలో వేల ఫోటోలు పెడతాం. ఒక్కసారి..మన అమ్మ నాన్నలతో గంటసేపు మాట్లాడామా..? మన అన్నాచెల్లెళ్లతో మన హృదయాన్ని నవ్వుకున్నామా..? మన బంధువుల ఇంటికి మనస్ఫూర్తిగా వెళ్ళామా..? జీవితం చాలా చిన్నది. ఆహా పెట్టుకోవడానికి కాదు.. మనుషులను పట్టుకోవడానికి. డబ్బు సంపాదించండి. కానీ మనుషులను కోల్పోయి కాదు. విజయం సాధించండి. కానీ బంధాలను త్యాగం చేసి కాదు. పిల్లలకు ఆస్తులు ఇవ్వండి..కానీ వాటికంటే విలువైన సంబంధాలను కూడా వారసత్వంగా ఇవ్వండి. గుర్తుంచుకోండి.. మీ పిల్లలు మీరు సంపాదించిన డబ్బును కొంతకాలం మాత్రమే గుర్తుంచుకుంటారు. కానీ మీరు ఎలా మనుషులను ప్రేమించారో.. ఎలా బంధాలను కాపాడారో..అదే తర తరాలకు గుర్తుండిపోతుంది. ఈరోజే సంకల్పం తీసుకుందాం. అహం తగ్గిద్దాం. క్షమించడం నేర్చుకుందాం. ముందుగా మనమే పలకరిద్దాం. కుటుంబాన్ని మళ్ళీ కుటుంబంగా మారుద్దాం. ఎందుకంటే...మనిషి చనిపోయిన తర్వాత అతని బ్యాంక్ బ్యాలెన్స్ గురించి ఎవరూ మాట్లాడరు..అతను ఎంత మంచి మనిషో...ఎంత మందిని కలుపుకొని జీవించాడో...అదే మాట్లాడుకుంటారు.మనం వదిలి వెళ్లేది ఆస్తులు మాత్రమే కాదు..మీ ఇంటి నుంచే... మీ పలకరింపు తోనే ప్రారంభించండి. మనుషులను మార్చుదాం... మన పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయడం అందాం..!!!

# స్థానిక ఎన్నికల విజయమే లక్ష్యం.. జనసైనికులు గ్రామాలలో పర్యటించాలి...





**ప్రతి గ్రామంలో జనసేన జెండా ఎగరేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలి.**

**జనసేన అధ్యక్షుడు మురళి పిలుపు.**

జీనాబాడు, పినకోట, కివర్ల మారుమూల పంచాయతీల్లో మండల అధ్యక్షుడు చిట్టం మురళి విస్తృత పర్యటన. అనంతగిరి మండలం. అక్టోబర్ 4. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్. అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి జనసైనికుడు ఇప్పటి నుంచే గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలతో మమేకం కావాలని జనసేన పార్టీ అనంతగిరి మండల అధ్యక్షుడు చిట్టం మురళి పిలుపునిచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తూ ప్రతి గ్రామంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. అనంత గిరి మండలంలోని జీనాబాడు, పినకోట, కివర్ల పంచాయతీల పరిధిలో చిట్టం మురళి విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో జనసైనికులు, పార్టీ నాయకులు, ప్రజలను కలుసకుని స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామం జనసేనకు బలమైన పునాది కావాలి. స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీకి అత్యంత కీలకమైనవని, ప్రతి గ్రామంలో జనసైనికులు ప్రజలకు అందుబాటులో ఉండాలని మురళి సూచించారు. జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని చెప్పారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే గ్రామాల్లో కనిపించడం కాదు.. ప్రజల కష్టాల్లో, సమస్యల్లో నిరంతరం మనం ఉండాలి. ప్రతి గ్రామానికి వెళ్లండి.. ప్రతి కుటుంబాన్ని పలకరించండి. ప్రజల సమస్యలను తెలుసుకోండి. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన విజయమే మనందరి లక్ష్యం అని చిట్టం మురళి జనసైనికులకు దిశానిర్దేశం చేశారు. కివర్ల జాలడలో ఘన స్వాగతం కివర్ల పంచాయతీ పరిధిలోని జాలడ గ్రామంలో చిట్టం మురళికి మహిళలు, గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు పుష్పగుచ్ఛం అందించి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు వివరించిన సమస్యలను ఓపికగా విన్న మురళి, వాటి వివరాలను తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామాల్లో పెరుగుతున్న జనసేన బలం జీనాబాడు పంచాయతీ పరిధిలో జనసైనికులతో సమావేశమైన మురళి.. రాబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి కార్యకర్త గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పినకోట పంచాయతీ పరిధిలోని చీడిమెట్టు, బొర్రాపాలెం తదితర ప్రాంతాల్లో కూడా ఆయన పర్యటించి ప్రజలతో మాట్లాడారు. గ్రామాల్లో పార్టీకి ఉన్న బలాన్ని మరింత పెంచేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని అన్నారు.ప్రజల సమస్యలే జనసేన ప్రధాన అజెండా జనసేన పార్టీకి ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండా అని చిట్టం మురళి పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశుద్ధ్యం, రవాణా, మౌలిక వసతులు తదితర సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రజల పక్షాన నిరంతరం నిలబడాలని కార్యకర్తలకు సూచించారు. "గ్రామ ప్రజలతో మన సంబంధం మరింత బలపడాలి. ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం ముందుండే పార్టీగా జనసేనను ప్రతి గ్రామంలో నిలబెట్టాలి. స్థానిక ఎన్నికల్లో జనసేన జెండా ఎగరడమే మన లక్ష్యం" అని మురళి స్పష్టం చేశారు. ఈ పర్యటనలో జనసేన పార్టీ మండల కార్యదర్శి పాంగి లక్ష్మణ్, బి.సంజీవ్ రావు, సాగర మధు, డి. చంటి, జీనాబాడు పంచాయతీ నాయకులు జమ్మ రాజు,పినకోట పంచాయతీ నాయకులు లిదేముడు, పైడితల్లి, గడ్డిదొర, కివర్ల పంచాయతీ నాయకులు శేషు, దేముడు తదితరులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో అనంతగిరి మండలంలో జనసేన పార్టీ క్షేత్రస్థాయి కార్యక్రమాలను ముమ్మరం చేస్తుండటంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ప్రతి గ్రామంలో పార్టీ బలాన్ని పెంచి, స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా జనసైనికులు ముందుకు సాగుతున్నారు

## కర్నూలు జిల్లా సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...

**కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్**



**కర్నూలు, అక్టోబర్ 04 ప్రజా జ్యోతి** నకిలీ ఐపీఓలు, షేర్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో సైబర్ మోసాలు.అధిక లాభాల ఆశ చూపి సైబర్ నేరగాళ్ల వలలోకి లాగుతున్న మోసగాళ్లు.గుర్తుతెలియని వ్యక్తులు, లింకులు, గ్రూపుల ద్వారా పెట్టుబడులు పెట్టొద్దు.సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి.ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా సైబర్ మోసాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండి మోసగాళ్ల వలలో పడకుండా జాగ్రత్త వహించాలని కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ఇటీవల స్టాక్ మార్కెట్ పెట్టుబడులు, షేర్లు, నకిలీ ఐపీఓల పేరుతో ప్రజలను బురిడీ కొట్టించే కేసులు ఎక్కువగా వెలుగుచూస్తున్నాయని తెలిపారు. అధిక లాభాల పేరుతో సైబర్ మోసాలు...అధిక లాభాలు ఆశజూపుతూ, ప్రముఖ కంపెనీల ఐపీఓ షేర్లు సులభంగా కేటాయిస్తామంటూ సైబర్ నేరగాళ్లు సామాజిక మాధ్యమాల ద్వారా లేదా ఫోన్ కాల్స్ ద్వారా సంప్రదిస్తున్నారు.వందల, వేల సంఖ్యలో షేర్లు అలాట్ అయ్యాయని, ఒక్కో షేరు విలువ త్వరలోనే భారీగా పెరుగుతుందని నమ్మిస్తారు.ఆ షేర్లను కొనుగోలు చేయాలంటూ బాధితుల వద్ద నుంచి ముందస్తుగా పెద్ద మొత్తంలో డబ్బులను గుర్తుతెలియని ఖాతాల్లోకి జమ చేయించుకుంటున్నారు. బాధితులు నగదు బదిలీ చేసిన తర్వాత ఆషేర్లు కేటాయించబడక పోవడంతో పాటు, సైబర్ మోసగాళ్లు అందుబాటులోకి రాకుండా పోతున్నారు.

**ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు...**

అధీకృత సెబీ గుర్తింపు పొందిన బ్రోకర్లు లేదా అధికారిక బ్యాంకింగ్ మాధ్యమాల ద్వారా కాకుండా గుర్తుతెలియని వ్యక్తులు, లింకులు లేదా గ్రూపుల ద్వారా షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టవద్దు.తక్కువ సమయంలో భారీ లాభాలు వస్తాయనే ఆశతో వచ్చే సందేశాలు, కాల్స్‌ను అస్సలు నమ్మవద్దు.అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా, తెలియని యాప్‌లను మొబైల్ ఫోన్‌లలో ఇన్‌స్టాల్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.సైబర్ మోసానికి గురైనట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి.త్వరగా ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే రాజకీయాల్లోకి వచ్చాను

## విద్యార్థులకు ఉచిత సైకిళ్ళ పంపిణీలో మంత్రి నిమ్మల రామానాయుడు.





**పాలకొల్లు ప్రజా జ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. అక్టోబర్ 4.** .ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని వరుసగా పాలకొల్లు ఎమ్మెల్యేగా వరుసగా మూడుసార్లు విజయం చేకూర్చినందుకు నియోజకవర్గం పరిధిలో ప్రజల రుణం తీర్చుకోవడానికి ప్రతిరోజు విశ్రాంతి లేకుండా పని చేస్తున్నానని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. జయలక్ష్మి సీ ఫుడ్స్ విశాఖపట్నం వారు ఇచ్చిన సి ఎస్ ఆర్ నిధులతో పాలకొల్లు లోని యస్ కె పి, టి వి అర్ మున్సిపల్ స్కూల్, పి యల్ కె హైస్కూల్ నందు ఆరవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు చదువుతున్న 250 మంది విద్యార్థులకు స్థానిక బిఆర్ యమ్ వి హైస్కూల్లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఉచిత సైకిళ్ళు మంత్రి నిమ్మల రామానాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ మాట్లాడుతూ 6 నుంచి 10 తరగతి వరకు విద్యార్థిని, విద్యార్థులకు దశలవారీగా ఉచితంగా సైకిళ్లను అందించాలన్న లక్ష్యంతో ఉన్నానని ఇందుకు 10వేల సైకిల్స్ వరకూ అవసరమవుతాయని అన్నారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా సి అర్ యస్ నిధులను పెద్ద పెద్ద కంపెనీల వారిని కోరి తెస్తున్నామన్నారు. తాను రాజకీయాల్లోకి రాక ముందు నుండే ప్రజలకు సేవాలందించాలని 2005 లో తమ తండ్రి గారి పేరిట ధర్మారావు ఫౌండేషన్ ఏర్పాటు చెయ్యటం జరిగిందన్నారు. అప్పటినుండి పలు సేవా కార్యక్రమాలు నిరంతరం చేస్తున్నానని తెలిపారు. 100మంది వృద్దులకు 200మంది దివ్యాంగులకు అవసరమైన సేవలందిస్తున్నామన్నారు ధర్మారావు ఫౌండేషన్ పేరిట 100 వరకు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశామని వేసవిలో మజ్జిగ చలివేంద్రాలు పెడుతున్నామని చిరు వ్యాపారులకు నాలుగు చక్రాల బండ్లు అందజేస్తున్నామన్నారు. అంతిమ సంస్కారాలకు సేవలందించేందుకు ఫ్రీజర్ బాక్స్ కైలాస రథం అందుబాటులో ఉంచుతున్నామన్నారు. వీటితోపాటు ధర్మారావు పౌండేషన్ ఇతర సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతున్నదన్నారు. ఈ సందర్భంగా సైకిళ్ల పంపిణీకి సి అర్ యస్ నిధులను సమకూర్చిన జయలక్ష్మి సీ ఫుడ్స్ కంపెనీ అధినేత రమేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న కంపెనీ డైరెక్టర్ మహినాథ్ ను మంత్రి రామానాయుడు సత్కరించారు. సభలో పాల్గొన్న ఒక విద్యార్థి తల్లి సుబ్బలక్ష్మి వేదిక పైకి వచ్చి మంత్రి నిమ్మల సేవా కార్యక్రమాలపై భావోద్వేగంతో మాట్లాడారు. పాలకొల్లు లో కనిపించని దైవం శ్రీ క్షీరా రామలింగేశ్వరుడు అయితే కనిపించే దైవం నిమ్మల రామానాయుడు అని పేర్కొన్నారు. విద్య అనేది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే సాధనమని విద్యను ప్రోత్సహించడానికి నియోజకవర్గం విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందజేయడం అభినందనీయమని మంత్రి నిమ్మల రామానాయుడు అందిస్తున్న ఈ సేవలను విద్యార్థులు మర్చిపోరని అన్నారు. తమకు ముగ్గురు పిల్లలని ముగ్గురికీ సైకిల్స్ ఇవ్వటం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇందుకు ఆమె మంత్రివర్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు మంత్రి నిమ్మల సైకిళ్లు అందజేశారు. ఒక విద్యార్థిని ఎక్కించుకుని తానే స్వయంగా కొంతమేర సైకిల్ తొక్కారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్ బిజెపి నాయకులు ఉన్నమట్ల కపర్ది జనసేన నాయకులు విన్నకోట గోపి టీడీపీ నాయకులు జీవి, పెచ్చెట్టి బాబు పీతల శ్రీను ఎస్తేరు రాణి తదితర నాయకులు పాల్గొన్నారు.

# తల్లీబిడ్డల ఆరోగ్యమే తొలి ప్రాధాన్యం

### మారుమూల గిరిజన గ్రామాల్లో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. విశ్వ చైతన్య ఫీల్డ్ విజిట్

### గర్భిణులు, బాలింతలతో ముఖాముఖి.. ఆరోగ్యంపై అవగాహన







**చింతూరు, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి):** మారుమూల గిరిజన ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఎన్. విశ్వ చైతన్య పీహెచ్‌సీ ఏడుగురాళ్లపల్లి పరిధిలోని పావుర్లంక, దొంగలజగ్గారం గిరిజన గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని గర్భిణులు (ఏఎన్సి), బాలింతలు ( పిఎన్సి) తో ఆయన ముఖాముఖిగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రసవానంతరం తల్లి, శిశువు ఆరోగ్య పరిరక్షణ, పోషకాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని, తొలి ఆరు నెలల పాటు బిడ్డకు కేవలం తల్లిపాలనే ఇవ్వాలని డా. విశ్వ చైతన్య సూచించారు. బిడ్డకు సరైన భంగిమలో, అవసరమైనప్పుడల్లా తల్లిపాలు అందించడం వల్ల శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడని వివరించారు. గర్భిణులు ప్రతిరోజూ ఐరన్, ఫోలిక్ యాసిడ్, కాల్షియం వంటి పోషకాలు లభించే ఆహారం తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రత పాటిస్తూ తగినంత విశ్రాంతి తీసుకోవాలని, ఎడమవైపు తిరిగి పడుకోవడం మంచిదని తెలిపారు. బరువైన పనులు చేయడం, మద్యం, ధూమపానం వంటి వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ప్రమాదకర లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించాలని స్పష్టం చేశారు. గర్భిణులు క్రమం తప్పకుండా ఏఎన్సి పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచనల మేరకు అవసరమైన పరీక్షలు, టీకాలు, ఐఎఫ్ఏ మాత్రలు తీసుకోవాలని తెలిపారు. హిమోగ్లోబిన్, బీపీ, బరువు తదితర పరీక్షలు చేయించుకోవడంతో పాటు 18--20 వారాల మధ్య అనామలీ స్కాన్, అవసరమైన సమయంలో గ్రోత్ స్కాన్ చేయించుకోవడం ద్వారా హైరిస్క్ గర్భాలను ముందుగానే గుర్తించి తగిన వైద్యం అందించవచ్చని వివరించారు. ప్రతి గర్భిణీ సురక్షిత ప్రసవం కోసం ఆసుపత్రిలోనే ప్రసవం చేయించుకోవాలని డా. విశ్వ చైతన్య సూచించారు. క్రమం తప్పకుండా పీహెచ్‌సీకి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ ఫీల్డ్ విజిట్‌లో ఆశా కార్యకర్త, అంగన్‌వాడీ కార్యకర్త, ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# మన అడవులు.. మన ప్రాణాలు.. మన బాధ్యత











**ఇందల్వాయి:** ఇందల్వాయి అటవీ రేంజ్ పరిధిలో వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా "మన అడవులు.. మన ప్రాణాలు.. మన బాధ్యత" అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి మోహన్ భట్ మాట్లాడుతూ.. అటవీ రక్షణతో పాటు వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఇందల్వాయి రేంజ్ పరిధిలోని ప్రతి సెక్షన్‌లో సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు అటవీ, వన్యప్రాణుల సంరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అడవులను అక్రమంగా నరికివేసే వారిపై అప్రమత్తంగా ఉండాలని, చెట్లను రక్షిస్తే అవే మన భవిష్యత్‌ను కాపాడతాయని అన్నారు. అడవుల్లోని వన్యప్రాణులను సంరక్షించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవ చ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి అడవులు, వన్యప్రాణుల పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. ర్యాలీలో సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, అటవీ సిబ్బంది, గ్రామస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ర్యాలీని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ రేంజ్ అధికారి కృతజ్ఞతలు తెలిపారు. అటవీ, వన్యప్రాణుల సంరక్షణలో అందరూ ఐకమత్యంతో పనిచేయాలని ఆయన సూచించారు.

## విధి రాసిన బంధం

విధి రాసిన కథలో ఊహించని మలుపు



అనగనగా ఒక అందమైన పల్లెటూరు. చుట్టూ పచ్చని పొలాలు, ఉదయాన్నే వినిపించే పక్షుల కిలకిలారావాలు, సాయంత్రం వేళ వీధుల్లో సందడి... అలాంటి ప్రశాంతమైన ఊరిలో ఒక చిన్న వీధి ఉండేది. ఆ వీధిలో విష్ణు అనే యువకుడు తన తల్లిదండ్రులతో కలిసి నివసిస్తూ ఉండేవాడు. చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి ఉన్న విష్ణు కష్టపడి చదువుకుని మంచి ఉద్యోగం సంపాదించాడు. అతని మంచితనం, మర్యాద, బాధ్యతాయుతమైన స్వభావం చూసి ఊరిలో అందరూ అతన్ని మెచ్చుకునేవారు. ఒకరోజు విష్ణు జీవితంలో అనుకోని మలుపు వచ్చింది.విష్ణు తండ్రికి చెల్లెలి కూతురు అయిన లహరితో విష్ణుకు పెళ్లి సంబంధం కుదిరింది. ఇరు కుటుంబాల పెద్దలు మాట్లాడుకుని, సంప్రదాయబద్ధంగా నిశ్చయ తాంబూలాలు జరిపించారు.నిశ్చితార్థం జరిగినా పెళ్లి మాత్రం వెంటనే జరగలేదు. ఏదో ఒక కారణంతో పెళ్లి సంవత్సరం పాటు వాయిదా పడింది. ఆ ఏడాది కాలంలో విష్ణు, లహరి ఇద్దరూ పెద్దల సమక్షంలో కలుస్తూ, మాట్లాడుకుంటూ, సరదాగా కాలక్షేపం చేస్తూ ఉండేవారు. వారి పెళ్లి ఎప్పుడెప్పుడు జరుగుతుందా అని ఇరు కుటుంబాల పెద్దలు ఎదురుచూస్తూ ఉండేవారు. కానీ ఎవరికీ తెలియకుండా విధి మరో కథ రాస్తోంది. విష్ణు పెదనాన్న కొడుకు రాము కూడా లహరిని ఇష్టపడటం మొదలుపెట్టాడు. మొదట తన మనసులోనే ఆ ప్రేమను దాచుకున్న రాము, రోజులు గడిచేకొద్దీ లహరిపై తనకు ఉన్న ఇష్టం మరింత పెరుగుతుందని గ్రహించాడు. అయితే అప్పటికే లహరి--విష్ణులకు నిశ్చితార్థం జరిగిపోయింది. రాము ముందు రెండు మార్గాలే కనిపించాయి. ఒకటి... తన ప్రేమను వదులుకోవడం. మరొకటి... లహరిని తన జీవిత భాగస్వామిగా చేసుకోవడానికి ప్రయత్నించడం. చివరకు తన ప్రేమ కోసం రాము విష్ణు--లహరి వివాహ సంబంధాన్ని చెడగొట్టే ప్రయత్నం చేశాడు. అనేక పరిణామాల తర్వాత విష్ణు--లహరి పెళ్లి సంబంధం రద్దయింది. అదే సమయంలో రాముకు వయసు ఎక్కువగా ఉండటం, అతని కుటుంబ పరిస్థితులు, పెద్దల అభిప్రాయాలు వంటి కారణాలతో ఇంట్లో వాళ్లు లహరితో రాము వివాహానికి అంగీకరించారు.పెద్దల సమక్షంలో రాము--లహరి వివాహం జరిగింది.ఒకప్పుడు విష్ణుకు నిశ్చయమైన లహరి ఇప్పుడు రాముకు భార్యగా కొత్త జీవితంలో అడుగుపెట్టింది. కాలం గడిచింది. రాము--లహరి ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకుంటూ, ప్రేమను పెంచుకుంటూ సంతోషంగా జీవించడం ప్రారంభించారు. వారి జీవితంలో చిన్న చిన్న సమస్యలు వచ్చినా కలిసి ఎదుర్కొంటూ ముందుకు సాగారు. మరోవైపు విష్ణు కూడా తన జీవితాన్ని ఆపుకోలేదు. కొంతకాలం తర్వాత విష్ణుకు మరో మంచి అమ్మాయి పరిచయమైంది. పెద్దల అంగీకారంతో వారి వివాహం జరిగింది. కొత్త భార్యతో విష్ణు కూడా సంతోషంగా జీవించడం ప్రారంభించాడు. ఒకప్పుడు తనకు దక్కాల్సిన బంధం చేజారిపోయినప్పటికీ, విష్ణు దాన్ని జీవితాంతం బాధగా మోసుకెళ్లలేదు. ఎందుకంటే... మన జీవితంలో మనం కోరుకున్నది దక్కకపోవచ్చు. కానీ దక్కిన జీవితాన్ని ఎలా అందంగా మలుచుకోవాలో మన చేతుల్లోనే ఉంటుంది. రాము తన ప్రేమను పొందాడు. లహరి తన జీవితాన్ని కొత్తగా ప్రారంభించింది. విష్ణు తనకు తగిన జీవిత భాగస్వామిని వెతుక్కున్నాడు.చివరికి ముగ్గురి జీవితాలు మూడు దారుల్లో నడిచినా... ప్రతి ఒక్కరూ తమ తమ జీవితాల్లో సంతోషాన్ని వెతుక్కున్నారు. కథ చెప్పే మాట "విధి మన కోసం ఏం రాసిందో మనకు ముందే తెలియదు. కొన్ని బంధాలు మన చేతుల మీదుగా జారిపోతాయి...కానీ అందుకే జీవితం ఆగిపోదు.కొత్త బంధాలు, కొత్త మనుషులు, కొత్త ఆశలు... జీవితానికి కొత్త అర్థాన్ని ఇస్తాయి."

## గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.



**పాలకొల్లు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. అక్టోబర్. 4.** గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు జోగాడ ఉమామహేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలో విధి నిర్వహణలో ఉన్న సుమారు 1680 మంది పార్ట్ టైమ్ ఉపాధ్యాయులు వారం రోజులుగా తమ న్యాయమైన సమస్యలను కూటమి ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలంటూ విజయవాడ లో శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న ఇంతవరకు ప్రభుత్వంలో కనీస చలనం లేకపోవడం వారి సమస్యలను పట్టించుకోకపోవడం శోచనీయమని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యా రంగాన్ని నడిపించే ఉపాధ్యాయులు తమ హక్కులు కోసం, పెండింగ్ సమస్యలు కోసం రోడ్లుపైకి వచ్చి పోరాడాల్సి రావడం అత్యంత విచారకరమన్నారు. కూటమి ప్రభుత్వం మొండి వైఖరిని విడనడాలని వార సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

## శబరిమలకు ధర్మవరం అయ్యప్ప స్వాముల పాదయాత్ర




**కాకినాడ జిల్లా అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన ఎనిమిది మంది అయ్యప్ప స్వాములు శబరిమల అయ్యప్ప స్వామి సన్నిధికి పాదయాత్ర చేపట్టారు. ఆదివారం ధర్మవరం గ్రామంలోని సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం వేలు గురుస్వామి పాదయాత్రను ప్రారంభించారు. ధర్మవరం గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారణ భక్తులు నానాజీ, రాజశేఖర్, వేములూరి రాంబాబు, జువ్వల రాంబాబు, జువ్వల గన్నిబాబు, కర్రి బాబ్జి, గోపాల్, శ్రీను పాదయాత్రలో పాల్గొన్నారు. ధర్మవరం నుంచి శబరిమల వరకు సుమారు 1,550 కిలోమీటర్ల దూరాన్ని రోజుకు 35 నుంచి 40 కిలోమీటర్ల చొప్పున 41 రోజుల్లో పూర్తి చేయాలని సంకల్పించినట్లు అయ్యప్ప స్వాములు తెలిపారు. అయ్యప్ప స్వామి అనుగ్రహంతో పాదయాత్ర విజయవంతంగా పూర్తవుతుందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ధర్మవరం గురుస్వాములు డాక్టర్ బొల్లు గంగాధర్, దాడి నాగపుత్ర, భవానీ భక్తులు, అయ్యప్ప భక్తులు, గ్రామస్తులు పాల్గొని పాదయాత్రకు శుభాకాంక్షలు తెలిపారు.

# విదేశీయులపై పోలీసుల ప్రత్యేక నిఘా

**బస వివరాల నమోదులో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు**

**జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్, ఐపీఎస్**



**బాపట్ల అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల జిల్లాకు వివిధ అవసరాల నిమిత్తం వచ్చే విదేశీయుల కదలికలపై పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. జిల్లాలోని హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు హాస్టళ్లు, అద్దె ఇళ్లు తదితర ప్రాంతాల్లో విదేశీయులు బస చేస్తే వారి పూర్తి వివరాలను సంబంధిత యాజమాన్యాలు తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్, ఐపీఎస్ తెలిపారు.విదేశీయుడు ఎక్కడి నుంచి వచ్చారు. ఏ అవసరంతో జిల్లాకు వచ్చారు.ఎక్కడ బస చేస్తున్నారు. ఎప్పుడు వచ్చారు, ఎప్పుడు వెళ్లారు వంటి వివరాలు పోలీసు, ఇమ్మిగ్రేషన్ విభాగాలకు అందుబాటులో ఉండేలా ఫారం-సి ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయడం తప్పనిసరి అని పేర్కొన్నారు. విదేశీయుడు వచ్చిన 24 గంటల్లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. విదేశీయులకు వసతి కల్పిస్తూ వారి వివరాలను నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేసే యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘనకు భారీ జరిమానాలతో పాటు జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. దీంతో వసతి నిర్వాహకులు రికార్డుల నిర్వహణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో నివసించే విదేశీయులు చెల్లుబాటులో ఉన్న పాస్‌పోర్టు, వీసా కలిగి ఉండటంతో పాటు భారత చట్టాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. ఓసీఐ కార్డుదారులు కూడా భారతదేశంలో ఎన్నికల్లో పోటీ చేయడం, ఓటు వేయడం, వ్యవసాయ భూములు కొనుగోలు చేయడం వంటి నిబంధనలకు విరుద్ధమైన చర్యలకు పాల్పడరాదని తెలిపారు. విదేశీయుల బసకు సంబంధించి అనుమానాస్పద సమాచారం ఉంటే ప్రజలు పోలీసులకు ఫోన్ లేదా ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. విదేశీయులకు వసతి కల్పించే యాజమాన్యాలు పోలీసు శాఖకు సహకరిస్తూ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

# బీజేపీ ఆలమూరు మండల సమావేశం,సేవా కార్యక్రమాలపై సమీక్ష,పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపు.



**ఆలమూరు అక్టోబర్ 4(ప్రజాజ్యోతి):**ఆలమూరు మండలం పెదపళ్ల గ్రామంలో ఆదివారం బీజేపీ మండల అధ్యక్షులు సుంకర శ్రీరాములు అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. సమావేశానికి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు తమ్మారెడ్డి, ఆలమూరు మండల ఇన్చార్జ్ పాలూరి సత్యానందం, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అయినవిల్లి సత్తిబాబు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగిరెడ్డి స్వామి, వడ్డీ నాగ దొరయ్య తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సేవా కార్యక్రమాలపై సమావేశంలో సమీక్షించారు. ఇంకా కొన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మండలంలోని గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు సూచించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వార్డు స్థాయి నుంచి జెడ్పీటీసీ వరకు పోటీ చేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త తన వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి యూజీవీ ప్రసాద్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వి. కృష్ణారెడ్డి, జిల్లా ఓబీసీ కార్యదర్శి కట్ట సత్యప్రసాద్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు నందూరి మోహన్ సుభాష్, కొవ్వూరు సీతారామరెడ్డి, పి. నాగరాజు,తోరాటి ఆంజనేయులు, మహేష్, గోపి, సూరిబాబు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యారంగంలో విశిష్ట సేవలకు సెయింట్ జోసెఫ్ ప్రిన్సిపాల్, కరస్పాండెంట్‌కు శిక్షా రత్న అవార్డులు




**బనగానపల్లె:అక్టోబర్4,(ప్రజా జ్యోతి)** విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తూ, విద్యార్థుల విద్యా ప్రగతి, సమగ్ర అభివృద్ధి, నాణ్యమైన విద్య కోసం అంకితభావంతో కృషి చేస్తున్న సెయింట్ జోసెఫ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ విజయ గీత, కరస్పాండెంట్ సిస్టర్ జ్యోతిలకు ప్రతిష్టాత్మక శిక్షా రత్న అవార్డు-2026లు లభించాయి.2026 సెప్టెంబర్ 6న హైదరాబాద్ లోని హరి యూనివర్సిటీ, కన్హా శాంతి వనంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు. విద్యారంగంలో వారి అంకితభావం, సమర్థవంతమైన నాయకత్వం, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి చేస్తున్న కృషి, భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడంలో అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ గౌరవాలను అందజేశారు.సిస్టర్ విజయ గీత నాయకత్వంలో సెయింట్ జోసెఫ్ హైస్కూల్ విద్యార్థులు విద్యా ప్రగతితో పాటు క్రమశిక్షణ, విలువలు, క్రీడలు, సాంస్కృతిక మరియు ఇతర సహపాఠ్య కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబరుస్తున్నారు. అదే విధంగా కరస్పాండెంట్ సిస్టర్ జ్యోతి అందిస్తున్న సహకారం, మార్గదర్శకత్వం పాఠశాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతోంది ఈ సందర్భంగా సెయింట్ జోసెఫ్ హైస్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సిస్టర్ విజయ గీత, సిస్టర్ జ్యోతిలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఈ రెండు ప్రతిష్టాత్మక అవార్డులు సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌కు గర్వకారణమని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం మరింత అంకితభావం తో సేవ చేయడానికి ఈ గౌరవాలు స్ఫూర్తినిస్తాయని వారు తెలిపారు.కార్యక్రమంలో టిచర్ మోహన్ రావు,తదితరులు ఉన్నారు.

# మాతృమూర్తి' ఆదిలక్ష్మికి ఘన నివాళి

**బీసీఎం 9 న్యూస్ అధినేత కార్తీక్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రగాఢ సానుభూతి**

**దశదిన కర్మలో పాల్గొని చిత్రపటానికి అంజలి ఘటించిన ముఖ్య నేతలు**



**ఎటపాక, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి):** భద్రాచలం సిటీ కేబుల్, జియో డిస్ట్రిబ్యూటర్ మరియు బీసీఎం 9 న్యూస్ అధినేత రామిశెట్టి కార్తీక్ మాతృమూర్తి రామిశెట్టి ఆదిలక్ష్మి దశదిన కార్యక్రమం ఆదివారం భద్రాచలంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎటపాక మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు రామిశెట్టి కార్తీక్ కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆదిలక్ష్మి మృతి కుటుంబానికే కాకుండా అందరికీ తీరని లోటని పేర్కొంటూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కురినాల వెంకటేశ్వర్లు (బుజ్జి), ఎటపాక మండల సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు గుడిమల్ల నాగలక్ష్మి, యువజన విభాగం నాయకులు తోట శశి కుమార్, ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షుడు కురినాల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతూన్న మహిళాపై ఫైనాన్స్ సిబ్బంది ఒత్తిళ్లు

**- షుగర్ వ్యాధితో ఒక కాలు తీసివేశారు మరో  కూడా  కాలు కూడా తీసేయాలి అంటునారు**

**-ఆరు నెలలు గడువు కోరుతున్న వినిపించుకోకుండా వేధింపు లు ఆపాలని బాధితురాలు వేడుకోలు**



**హిందూపురం: ప్రజా జ్యోతి న్యూస్:అక్టోబర్4:** శ్రీ సత్యసాయి జిల్లా బ్యూరో అంజి: హిందూపురం మండలం కిరికెర పంచాయతీ వినాయక నగర్ ఎస్సీ కాలనీ చెందిన ఆదిలక్ష్మి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుంచి చిన్న ఫైనాన్స్ సంస్థల వారితో ఇరవై వేలు రూపాయలు ముప్పై వేలు రూపాయలు వారం వాయిదాలతో అప్పుగా తీసుకుకొని సక్రమంగా కట్టుకుంటూ వెళుతున్నను కానీ నాకు మధుమేహం  వ్యాధి రావడం వాళ్ళ ఎడమ కాలు డాక్టర్లు తొలగిచినారు ఇపుడు నాకు షుగర్ 390 ఉండడం వల్ల  నా కుడి కాలు కుళ్లు పోయింది కొన్ని నెలలు నుంచి ప్రైవేట్ మరియు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉన్నాను చిన్న చిన్న ఫైనాన్స్ సంస్థలతో తీసుకున్న నగదు మా గ్రామంలో కొంతమంది వ్యక్తులకు ఇచ్చినను వాళ్ళు గ్రామ వదిలి వెళ్ళినారు ముగ్గురు చనిపోయారు మిగిలిన కొంతమంది డబ్బులు తీసుకొని ప్రస్తుతం మా దగ్గర డబ్బులు లేవు అనీ నేను ఎన్ని సార్లు అడిగినా చెపుతున్నారు ప్రస్తుతం నా ఆరోగ్యం పరిస్థితి బాలేనందున నాకు ఆరు నెలల గడువు ఇవ్వాలని కోరుతూనన్ను కానీ ఫైనాన్స్ వారు నా ఇంటి దగ్గరకు వచ్చి నన్ను వేధిస్తున్నారు ప్రస్తుతం నేను నా ఆరోగ్యం కాపాడుకోవడం కోసం ఆస్పత్రిలో నిరంతరం చికిత్సలకు వెళ్తున్నాను  స్థానిక పోలీస్ అధికారులు చిన్న ఫైనాన్స్ వారితో నాకు  రక్షణ కల్పించి నాకు ఆరు నెలలు సమయం గడువు ఇప్పించాలని విజ్ఞప్తి చేస్తున్నాను

# ఆర్ఎంపీల పేరుతో అక్రమ వైద్యం సాగితే సహించేది లేదు

**మెడికల్ షాపుల ముసుగులో ఆసుపత్రుల నిర్వహణపై కఠిన చర్యలు తీసుకోవాలి: సీపీఐ**



**ప్రజాజ్యోతి న్యూస్ అక్టోబర్ 4** ప్యాపిలి మండలంలో మెడికల్ షాపుల ముసుగులో కొందరు ఆర్ఎంపీలు పడకలు ఏర్పాటు చేసి, సెలైన్లు ఎక్కిస్తూ ఆసుపత్రుల తరహాలో వైద్యం నిర్వహిస్తున్నారంటూ 'దినపత్రికలో ప్రచురితమైన కథనంపై సీపీఐ మండల కార్యదర్శి మహేష్ తీవ్రంగా ఖండిస్తోన్నారు.ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే విధంగా అనుమతులు, అర్హతలు లేని వ్యక్తులు వైద్యం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నా సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని భారత కమ్యూనిస్టు పార్టీ  ప్రశ్నిస్తోంది. మెడికల్ షాపులో మందులు విక్రయించాల్సింది పోయి, లోపల పడకలు ఏర్పాటు చేసి రోగులకు చికిత్సలు అందిస్తే అది ప్రజారోగ్యానికి తీవ్ర ప్రమాదకరం.అర్హత కలిగిన వైద్యుల పర్యవేక్షణ లేకుండా ఇలాంటి వైద్య విధానాలు కొనసాగితే రోగుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని మహేష్ ఆందోళన వ్యక్తం చేశా రు. పత్రికలో వచ్చిన ఆరోపణలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెంటనే విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.అలాగే ప్యాపిలి మండలంలోని మెడికల్ షాపులు, క్లినిక్‌లు, ఆర్ఎంపీ కేంద్రాలను సమగ్రంగా తనిఖీ చేసి, అక్రమంగా బెడ్లు ఏర్పాటు చేయడం, సెలైన్లు ఎక్కించడం, అర్హత లేని వ్యక్తులతో వైద్యం చేయించడం వంటి చర్యలకు తక్షణమే అడ్డుకట్ట వేయాలి.అధికారులు తనిఖీల పేరుతో ఫోటోలు తీసుకుని వెళ్లిపోవడం కాకుండా, తప్పిదాలు బయటపడితే కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేసే విధానాన్ని సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది.ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సీపీఐ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నాం.సీపీఐ ప్యాపిలి మండల కార్యదర్శి మహేష్

# అమ్రాన్ ఇస్మాయిల్ బాషా--అస్మా దంపతులకు గుజ్జుల గౌరీశ్వర నాయుడు శుభాకాంక్షలు



**ప్రజా జ్యోతి నందికొట్కూరు** కర్నూలు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో కార్యాలయ సహాయకుడిగా ప్రభుత్వ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న ఖాజా బాషా కుమారుడు అమ్రాన్ ఇస్మాయిల్ బాషా--అస్మా వివాహం జరిగిన సందర్భంగా, సామాజిక కార్యకర్త గుజ్జుల గౌరీశ్వర నాయుడు వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతుల నికాహ్ కార్యక్రమం అక్టోబర్ 4, ఆదివారం ఉదయం 11:30 గంటలకు జోగులాంబ గద్వాల్ జిల్లా, ఆలంపూర్ న్యూ ప్లాట్స్‌లోని బి.ఆర్.ఎస్. ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, కలకాలం ఆనందంగా జీవించాలని, అల్లాహ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ వారిపై ఉండాలని గుజ్జుల గౌరీశ్వర నాయుడు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నంద్యాల జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు, నందికొట్కూరు పట్టణ కార్యదర్శి కాటేపోగు సోమన్న తదితరులు పాల్గొన్నారు.

# నందికొట్కూరు జర్నలిస్టు అబ్దుల్లాకు వివాహ శుభాకాంక్షలు: గుజ్జుల గౌరీశ్వర నాయుడు



**ప్రజా జ్యోతి నందికొట్కూరు** ప్రజా ప్రతిభ నందికొట్కూరు పత్రిక రిపోర్టర్ అబ్దుల్లా గత ఆదివారం వివాహం జరిగిన సందర్భంగా, సామాజిక కార్యకర్త గుజ్జుల గౌరీశ్వర నాయుడు ఆయన వ్యాపార స్థలంలో కలిసి నూతన దంపతులకు హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అబ్దుల్లా గారి తండ్రికి కూడా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నంద్యాల జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు, నందికొట్కూరు పట్టణ కార్యదర్శి కాటేపోగు సోమన్న తదితరులు పాల్గొన్నారు. నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, కలకాలం ఆనందంగా జీవించాలని వారు ఆకాంక్షించారు.

# వీఆర్ఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలి:

**పిక్కిలి వెంకటేశ్వర్లు**




**ప్రజా జ్యోతి నందికొట్కూరు** నందికొట్కూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్ఏలు చేపట్టిన 19వ రోజు రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఏఐసీసీటీయూ గౌరవ అధ్యక్షులు పిక్కిలి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు కాటేపోగు సోమన్న సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా నియమించాలని, అర్హులకు వీఆర్వో ప్రమోషన్లు కల్పించాలని, మృతిచెందిన వీఆర్ఏల కుటుంబాల్లో అర్హులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏల పెండింగ్ సమస్యలను పరిష్కరించే వరకు తమ మద్దతు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ సంఘం నాయకులు జె. మహేశ్వర, బి. రమణ, కే. మహేష్, పుల్లయ్య, వెంకటేశ్వర్లు, శంకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కోటేకల్  వద్ద తప్పిన పేను ప్రమాదం

**కుక్క అడ్డురావడంతో కారు బోల్తా**



**ఎమ్మిగనూరు, అక్టోబర్ 04 (ప్రజాజ్యోతి ):** ఎమ్మిగనూరు మండలం కోటేకల్ సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదం తప్పింది. మంత్రాలయం దర్శనం చేసుకుని బెంగుళూరుకు వెళుతున్న కే ఏ 03 ఎన్ జెడ్ 2078 కారు మార్గమధ్యలో కుక్క అడ్డురావడంతో దాన్ని తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి వారిని కారులో నుంచి బయటకు తీశారు. పెద్ద ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

## బిజినెస్

# ఐఏఎఫ్ కాంట్రాక్టు లభిస్తే.. భారత్‌లో విమానాల తయారీ!



**వాషింగ్టన్/దిల్లీ:** భారత వాయుసేన (ఐఏఎఫ్) కోసం మధ్య తరహా రవాణా విమానాల సరఫరా కాంట్రాక్ట్ కనుక తమకు లభిస్తే, భారత్‌లో తమ ఉత్పత్తి సామర్థ్యాలను మరింత విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామని అమెరికా దిగ్గజ సంస్థ లాక్‌హీడ్ మార్టిన్ సీనియర్ అధికారి వెల్లడించారు. 60 మధ్య తరహా రవాణా విమానాలు కొనుగోలు చేసేందుకు 10.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.లక్ష కోట్ల) అంచనా వ్యయంతో, మనదేశం ఆగస్టులో టెండర్ జారీ చేసింది. ఈ కాంట్రాక్ట్ కోసం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్), మహీంద్రా గ్రూప్, అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), రిలయన్స్ డిఫెన్స్ సంస్థలు పోటీలో ఉన్నాయి. ఈ భారతీయ సంస్థలు అంతర్జాతీయ విమాన తయారీ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుని, ఈ ప్రాజెక్టు బిడ్డింగ్‌లో పాల్గొంటున్నాయి.

**హైదరాబాద్‌లో ఇప్పటికే**

లాక్‌హీడ్ మార్టిన్‌కు టీఏఎస్ఎల్‌తో దీర్ఘకాలంగా భాగస్వామ్యం ఉంది. హైదరాబాద్-వడోదరలో టాటాతో కలిసి సంయుక్తంగా నెలకొల్పిన టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్స్ లిమిటెడ్ (టీఎల్ఎంఏఎల్) ప్లాంట్లున్నాయి. సీ-130జే విమానాలకు వివిధ విడిభాగాలు, వెనుక భాగంలోని నిర్మాణాలను తయారు చేస్తున్నట్లు లాక్‌హీడ్ మార్టిన్ గ్లోబల్ బిజినెస్ డెవలప్‌మెంట్ - స్ట్రాటజీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాన్ టెన్నీ తెలిపారు. కొత్త ఆర్డర్ లభిస్తే ఈ సామర్థ్యాన్ని మరింత విస్తరించనున్నట్లు ఆయన చెప్పారు. విమానాల తయారీతో పాటు ఇతర కార్యకలాపాలు కూడా భారత్‌లోనే జరిగేలా చూస్తామన్నారు. లాక్‌హీడ్ మార్టిన్ ప్రతిపాదన ప్రకారం మొత్తం 60 విమానాల్లో 12 విమానాలను పూర్తిగా సిద్ధం చేసిన స్థితిలో భారత్‌కు అందిస్తారు. మిగిలిన 48 విమానాలను భారత్‌లోనే తయారు చేస్తామని కంపెనీ ప్రతిపాదించింది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఇప్పటికే వినియోగిస్తున్న 12 సీ-130జే విమానాలను కూడా అధునాతన కాన్ఫిగరేషన్‌కు అప్‌గ్రేడ్ చేస్తామనీ లాక్‌హీడ్ మార్టిన్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన అమలైతే, ఐఏఎఫ్ వద్ద ఒకే రకమైన అధునాతన కాన్ఫిగరేషన్ కలిగిన మొత్తం 72 విమానాలుంటాయి. ప్రస్తుతం ఐఏఎఫ్ వినియోగిస్తున్న సీ-130జే విమానాలు ఇప్పటివరకు 58,000కు పైగా విమాన ప్రయాణ గంటలను పూర్తి చేశాయి. లద్దాఖ్‌లోని అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో ఇవి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. నేపాల్‌లో వరదల సమయంలో సహాయక చర్యలు, 2023లో సూడాన్‌లో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తరలించే ఆపరేషన్ వంటి కీలక మిషన్లలో ఈ విమానాలను ఉపయోగించారు.

# ప్రాపర్టీ రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ మధ్య తేడా ఏంటి?

**రిజిస్ట్రేషన్**

మీరు ఏదైనా స్థిరాస్తి కొన్నప్పుడు ప్రభుత్వం వద్ద నమోదు ద్వారా చట్టబద్ధంగా దాని యాజమాన్య హక్కుల్ని బదిలీ చేసుకోవడం అవసరం. కేవలం కొన్నదేగాక, మీకు వారసత్వంగా వచ్చినా, బహుమతి రూపం లో అందినా, వీలునామా ద్వారా సంక్రమించినా ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ప్రాపర్టీ యజమాని బదిలీ చేస్తే తప్ప.. మీరు సదరు ఆస్తికి యజమాని కాలేరుమరి. ఇక ఆస్తి విలువ రూ.100 దాటితే భారతీయ రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 17 కింద ఆ ఆస్తిని రిజిస్టర్ చేయించాల్సిందే. సేల్ డీడ్, వీలునామా, గిఫ్ట్ డీడ్ తదితర యాజమాన్య ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్ ఇతర గుర్తింపు పత్రాలు ఇందుకు అవసరమవుతాయి. స్థిరాస్తి ఎక్కడ ఉన్నదో ఆ పరిధిలోని సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్‌లో సాక్షుల సమక్షంలో కొన్నవారు, అమ్మినవారు సంబంధిత డాక్యుమెంట్లను సమర్పించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. అయితే పేర్కొన్న రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీలను చెల్లించాల్సి ఉంటుంది.

**మ్యూటేషన్**

ప్రభుత్వ భూ రెవిన్యూ రికార్డుల్లో ఆస్తి యజమాని పేరును మార్చడమే మ్యూటేషన్ ప్రక్రియ. ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ పూర్తయ్యాకే మ్యూటేషన్‌కు వీలుంటుంది. సంబంధిత పత్రాలను సమర్పించి, మ్యూటేషన్ ఫీజు చెల్లిస్తే స్థానిక మున్సిపల్ కార్యాలయాల్లో పని జరుగుతుంది. ఆస్తి పన్ను, నీరు, విద్యుత్తు, గ్యాస్ కనెక్షన్ల కోసం కూడా ఇది తప్పనిసరి.




తర్వాత రోజుల్లో కొన్న ఆస్తిని తిరిగి అమ్ముకోవాలన్నా ఈ మ్యూటేషన్ ముఖ్యం. పైగా ఈ ప్రాపర్టీ రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌లు ఆస్తుల తగాదాలనూ నివారించగలవు.

# ఈఎంఐలు భారం కానున్నాయా? ఆర్‌బీఐ వడ్డీ రేట్లు పెంచే ఛాన్స్

**ముంబయి:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలకమైన రెపోరేటును పెంచే అవకాశం ఉంది. అక్టోబర్ నెల ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రెపోరేటును 0.25 శాతం మేర పెంచుతూ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు, బ్యాంకర్లు అభిప్రాయపడుతున్నారు. పశ్చిమాసియాలో అనిశ్చిత పరిస్థితుల కారణంగా నెలకొన్న ద్రవ్యోల్బణ భయాలకు తోడు, ఇతర కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు సవరిస్తుండడమే ఇందుక్కారణమని పేర్కొంటున్నారు. ఒకవేళ విశ్లేషకులు ఊహించినట్లే ఆర్‌బీఐ వడ్డీ రేట్లు సవరిస్తే.. రెపోరేటుతో ముడిపడి ఉన్న గృహ, వాహన రుణాలు ప్రియం కానున్నాయి. ఆ మేర నెలవారీ చెల్లించే ఈఎంఐలు భారం కానున్నాయి. 2023 ఫిబ్రవరిలో చివరిసారిగా ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచింది. దీంతో అప్పట్లో రెపోరేటు 6.50 శాతానికి చేరింది. ఆపై 2023-24లో స్థిరంగా కొనసాగించింది. 2025లో వరుసగా వడ్డీ రేట్లు తగ్గించిన ఆర్‌బీఐ.. పశ్చిమాసియా పరిస్థితుల నేపథ్యంలో స్థిరంగా కొనసాగిస్తోంది. ప్రస్తుతం రెపో రేటు 5.25 శాతంగా ఉంది. అక్టోబర్ నెలకు సంబంధించిన ఎంపీసీ భేటీలో రెపోరేటుపై నిర్ణయం తీసుకోనుంది. బుధవారం నిర్ణయం వెలువడనుంది.




**పాత ప్రీమియం కార్లను కొనేద్దాం**

ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులతో సమానంగా ఆర్‌బీఐ కూడా వడ్డీ రేట్లు సవరించవచ్చని పలువురు ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, వృద్ధి ఊపందుకోవడం వంటివి ఇందుకు కారణాలని చెబుతున్నారు. ముఖ్యంగా పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు తలెత్తడం వల్ల ఇంధనం, కమొడిటీ ధరలు పెరుగుతున్నాయని, దీనివల్ల మరోసారి రెపోరేటు పెంచొచ్చని అభిప్రాయపడుతున్నారు. పీటీఐ నిర్వహించిన పోల్‌లో మెజారిటీ ఆర్థిక నిపుణులు ఇదే తరహా అభిప్రాయం వ్యక్తంచేశారు. అయితే, మరోసారి స్టేటస్ కో కొనసాగించే అవకాశమూ లేకపోలేదని మరో ఆర్థికవేత్త అభిప్రాయపడ్డారు. డిమాండ్ ఆధారిత ద్రవ్యోల్బణం ఇంకా ఊపందుకోని కారణంగా మరికొంతకాలం వేచి చూసే ధోరణిని ఆర్‌బీఐ అవలంబించొచ్చని అభిప్రాయం వ్యక్తంచేశారు.

# ఖతార్‌లో కలుద్దాం..

## అట్టహాసంగా ముగిసిన ఆసియా గేమ్స్

**నగోయా (జపాన్) :** రెండు వారాల పాటు వేలాది మంది ఆసియా క్రీడాకారుల హోరాహోరీ పోరాటాలకు వేదికగా నిలిచిన 20వ ఆసియా గేమ్స్‌కు తెరపడింది. నగోయాలోని మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం 90 నిమిషాల పాటు సాగిన ముగింపు వేడుకలు కనువిందు చేశాయి. ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (ఓసీఏ) అధ్యక్షుడు షేక్ జోఆన్ బిన్ హమద్ అల్ థానీ క్రీడలు ముగిసినట్లు అధికారికంగా ప్రకటించారు. అనంతరం ఓసీఏ పతాకాన్ని 2030 ఎడిషన్‌కు ఆతిథ్యం ఇచ్చే ఖతార్‌లోని దోహా నగర ప్రతినిధులకు అధికారికంగా అందజేశారు. ఖతార్ హైజంప్ దిగ్గజం ముతాజ్ బార్షిమ్ నుంచి ఈక్వెస్ట్రియన్ రైడర్ జాసిమ్ అల్ కువారీ ఆసియాడ్ పతాకాన్ని స్వీకరించాడు. ముగింపు వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలిచిన అథ్లెట్ల పరేడ్‌లో భారత ట్రాప్ షూటర్ నీరూ ధండా త్రివర్ణ పతాకాన్ని చేతిలో పట్టుకుని ముందు నడిచింది. తెలుపు, నీలం రంగు దుస్తులు ధరించిన సుమారు 30 మంది భారత అథ్లెట్లు, అధికారులు ఈ మార్చ్‌పాస్ట్‌లో పాల్గొన్నారు. 'వన్ ఆసియా' అనే ఇతివృత్తంతో రూపొందించిన వేదికపై జపాన్ సాంప్రదాయ 'బొన్-ఒడోరి' నృత్యాలు, 'మత్సుకెన్ సాంబా2' ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



**ఆరంభ లోపాలను దాటి**

ఈసారి ఆసియా క్రీడల నిర్వహణలో జపాన్ భిన్నమైన వ్యూహాన్ని అనుసరించింది. భారీ ఖర్చులతో ప్రత్యేకంగా అథ్లెట్స్ విలేజ్‌లు, కొత్త స్టేడియంలు నిర్మించకుండా.. అందుబాటులో ఉన్న వేదికలు, తాత్కాలిక నిర్మాణాలతో తక్కువ ఖర్చుతో క్రీడలను నిర్వహించింది. ఆరంభంలో హోటల్ వసతి సమస్యలు, రవాణా ఆలస్యం, అక్రిడిటేషన్ గందరగోళం ఎదురైనప్పటికీ.. నిర్వాహకులు త్వరగానే లోపాలను సరిదిద్ది పోటీలను విజయవంతంగా ముగించారు. 45 దేశాల నుంచి దాదాపు 11 వేల మంది అథ్లెట్లు పాల్గొన్న పోటీల్లో 54 ప్రపంచ రికార్డులు, 89 ఆసియా రికార్డులు బ్రేక్ అవడంతో ఈ ఆసియాడ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది.

## డివిలియర్స్ విధ్వంసం.. విండీస్‌పై సౌతాఫ్రికా భారీ స్కోరు



వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్) 2026 టోర్నీలో భాగంగా వెస్టిండీస్ చాంపియన్స్‌తో జరుగుతున్న టీ20 మ్యాచ్‌లో సౌతాఫ్రికా చాంపియన్స్ భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ ఏబీ డివిలియర్స్ (39 బంతుల్లో 70; 4 ఫోర్లు, 5 సిక్సర్లు), ఓపెనర్ రిచర్డ్ లెవీ (39 బంతుల్లో 87; 5 ఫోర్లు, 8 సిక్సర్లు) భారీ అర్ధశతకాలతో విధ్వంసం సృష్టించారు. వీరిద్దరి బీభత్సం ధాటికి సౌతాఫ్రికా చాంపియన్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. చివర్లో సారెల్ ఎర్వీ (23) ధాటిగా ఆడాడు. వెస్టిండీస్ చాంపియన్స్ బౌలర్లలో దేవ్ మొహమ్మద్ రెండు వికెట్లు తీయగా, ఫిడెల్ ఎడ్వర్డ్స్, రెయాడ్ ఎమ్రిట్, డ్వేన్ బ్రావో తలా ఒక వికెట్ తీశారు. ముందుగా రిచర్డ్ లెవీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఫోర్లు, సిక్సర్లతో మైదానం హోరెత్తించాడు. అగ్నికి వాయువు తోడైనట్లు లెవీకి డివిలియర్స్ జత కలవడంతో స్కోరుబోర్డు ఉరకలెత్తింది. ఈ ఇద్దరు రెండో వికెట్‌కు 42 బంతుల్లోనే 104 పరుగులు సాధించి సౌతాఫ్రికా భారీ స్కోరుకు బాటలు వేశారు. లెవీ ఔటైనప్పటికీ, సారెల్ ఎర్వీతో కలిసి డివిలియర్స్ జట్టు స్కోరును 200 దాటించాడు.

## స్పోర్ట్స్

# ముకేష్ వికెట్ల వేట.. 30వసారి 'ఇరానీ' విజేతగా రెస్టాఫ్ ఇండియా..!



భారత వన్డే జట్టులో చోటు కోల్పోయిన రిషభ్ పంత్ దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటాడు. ఆటగాడిగా ధనాధన్ బ్యాటింగ్‌తో అలరించే పంత్ ఈసారి కెప్టెన్‌గా రెస్టాఫ్ ఇండియా(=వర్ నాట ×అఎఖు)కు టైటిల్ అందించాడు. ఇరానీ కప్ (×తీఖుఅఱ జబజూ) ఫైనల్లో ముకేశ్ కుమార్(2-84, 33-6) ఎనిమిది వికెట్లతో విరచుకుపడగా.. పంత్ సారథ్యంలోని రెస్టాఫ్ ఇండియా 167 పరుగుల తేడాతో జమ్ము కశ్మీర్‌ను ఓడించింది. దాంతో రికార్డు స్థాయిలో ముప్పయ్యోసారి ట్రోఫీని ముద్దాడింది. ఇరానీ ట్రోఫీ 2026-27 ఫైనల్లో రెస్టాఫ్ ఇండియా అదరగొట్టింది. రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్ సనత్ సాంగ్వన్(55) అర్ధ శతకంతో శుభారంభమివ్వగా.. స్మరణ్ రవిచంద్రరన్(135) సూపర్ సెంచరీతో కదం తొక్కాడు. అనంతరం 279 పరుగుల ఛేదనలో జమ్ము కశ్మీర్ బ్యాటర్లను పేసర్ ముకేశ్ కుమార్ (2-84, 33-6) వణికించాడు. బుల్లెట్ బంతులతో నిప్పులు చెరిగిన ముకేశ్ ఏకంగా ఆరుగుని ఔట్ చేసి ప్రత్యర్థిని కోలుకోలేని దెబ్బతీశాడు. దాంతో.. జమ్ము 111 రన్స్‌కే కుప్పకూలింది. ఆల్‌రౌండ్ షోతో కనబరిచి 167 పరుగుల తేడాతో గెలుపొందిన రెస్టాఫ్ ఇండియా 30వ సారి ఈ టోర్నీలో ఛాంపియన్‌గా నిలిచింది. తద్వారా జట్టుకు ట్రోఫీ కట్టబెట్టిన రెండో వికెట్ కీపర్‌గా పంత్ గుర్తింపు సాధించాడు. ఖతర్నాక్ శతకంతో విజయంలో భాగమైన స్మరణ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.



# విశ్వక్‌సేన్ 'కల్ట్' విడుదల అప్పుడే

విశ్వక్‌సేన్ స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కల్ట్'. తారక్ సినిమా పతాకంపై సందీప్ కాకరాల భారీ టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్‌ని పూర్తి చేసుకున్నది. హైదరాబాద్ ఆర్‌ఎఫ్‌సీలో నిర్మించిన భారీసెట్‌లో వందలాది మోడల్స్‌తో 40-50 రోజుల పాటు జరిగిన కీలక సన్నివేశాల చిత్రీకరణతో షూటింగ్ పూర్తయిందని మేకర్స్ తెలిపారు. భారతీయ భాషలతోపాటు విదేశీ భాషల్లో కూడా ఈ సినిమాను విడుదల చేస్తున్నామని, ఈనెల 30న ప్రపంచవ్యాప్తంగా 'కల్ట్' విడుదల కానున్నదని మేకర్స్ చెప్పారు. గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మురళీశర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, తారక్ పొన్నప్ప, ప్రజ్ఞ ఇతరపాత్రధారులు. ఈచిత్రానికి మాటలు: తరుణ్‌భాస్కర్, సౌండ్ డిజైన్: 'యానిమల్'ఫేం సచిన్.

# ఓ వైపు శాంతం మరోవైపు రౌద్రం

ప్రస్తుతం సాయిపల్లవికి మహర్దశ నడుస్తున్నది. ఒక కథానాయికగా దేశవ్యాప్తంగా తిరుగులేని గుర్తింపు రావడం అరుదైన విషయం. అన్ని భాషలకు చెందిన ప్రేక్షకులూ తమ హీరోయిన్‌గా ఓన్ చేసుకోవడం ఈ మధ్య సాయిపల్లవి విషయంలోనే జరిగిందని చెప్పక తప్పదు. వచ్చే నెలలో రెండు వారాల తేడాతో ఆమె సినిమాలు రాబోతున్నాయి. వాటిలో మొదటిది నితీష్ తివారీ 'రామాయణ: పార్ట్ 1'. ఈ పాన్ ఇండియా పౌరాణిక దృశ్యకావ్యంలో సాయిపల్లవి సీతామహాసాధ్విగా కనిపించనున్నారు. సరిగ్గా ఈ సినిమా విడుదలైన రెండు వారాలకు, అంటే.. నవంబర్ 20న ధనుష్ హీరోగా రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఓం: చాప్టర్ 1' విడుదల కానున్నది. ఇందులో సాయిపల్లవిది కీలకమైన పాత్ర. యాక్షన్, ఎమోషన్స్‌తో ఆమె పాత్ర సాగుతుందని సమాచారం. రెండు వారాల గ్యాప్‌తో రెండు పొంతన లేని పాత్రల ద్వారా ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని సాయిపల్లవి పంచనున్నదని సినీవర్గాలు అంటున్నాయి. ఈ ప్రయత్నాలు రెండూ ఫలిస్తే.. సాయిపల్లవి క్రేజ్ దేశవ్యాప్తంగా మరింత పెరగడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



# మట్టితో మమేకమైన కూలీ కథ

హీరో శర్వానంద్ నటిస్తున్న ఇంటెన్స్ పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'. సంపత్‌నంది దర్శకుడు. కేకే రాధామోహన్ నిర్మాత. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్నది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా జరుగుతున్నాయి. ప్రమోషన్స్‌లో భాగంగా ఈసినిమా టీజర్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. గ్రామీణ జానపద శైలిలో సాగే వాయిస్ ఓవర్‌తో టీజర్ మొదలైంది. బొగ్గుల గుట్ట అనే గ్రామాన్ని అక్కడి నాగరికతనూ, పగలు, ప్రతీకారాలు, భక్తి, మూఢ విశ్వాసాల నేపథ్యంలో టీజర్ సాగింది. శర్వా రఫ్ అండ్ రగ్డ్ లుక్‌లో మట్టితో మమేకమైన ఓ సాధారణ కూలీగా కనిపించారు. అనుపమ పరమేశ్వరన్ పాత్ర కూడా సీరియస్ మోడ్‌లో ఆసక్తిని రేకెత్తించేలా ఉన్నది. 1960ల ప్రారంభంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని ఓ కల్పిత గ్రామం నేపథ్యంలో సాగే ఈ కథను దర్శకుడు సంపత్‌నంది ఎంతో సహజంగా, నేటివిటితో తెరకెక్కిస్తున్నట్టు టీజర్ చెబుతున్నది. రా, ఇంటెన్స్, రూటెడ్ ప్రపంచాన్ని టీజర్ ఆవిష్కరించింది. డింపుల్ హయాతీ మరో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కిశోర్‌కుమార్ అరోకియా, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సమర్పణ: లక్ష్మీ రాధామోహన్, నిర్మాణం: శ్రీసత్యసాయి ఆర్ట్స్.






# 'చకోర' ఓ అమ్మ చెప్పిన కథ

శ్రవణ్, మలైకా టి వాసుపల్ జంటగా నటించిన చిత్రం 'చకోర -- లూనార్ లవ్ బర్డ్'. మంగా శ్రీనివాస్ దర్శకుడు. చింతాడ హేమారావు నిర్మాత. అక్టోబర్ 9న సినిమా థియేట్రికల్ రిలీజ్ కానున్నది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్ వైజాగ్‌లో జరిగింది. ప్రముఖ దర్శకుడు శివ నిర్వాణ అతిథిగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. 'ఇదొక అమ్మ చెప్పిన ప్రేమకథ. కేవలం వర్షపునీళ్లతోనే దాహం తీర్చుకునే విశిష్టమైన పక్షి చకోర. ఆ పక్షిలాగే మనం కూడా స్వచ్ఛమైన పేమ కోసమే వేచి చూడాలని, అలాగే.. చకోర పక్షికి జాబిల్లిని చేరాలని కోరిక. దాని కోసం అలుపెరగకుండా ప్రయాణిస్తుంది. ఆ ప్రయత్నంలోనే మరణిస్తుంది. మనం కూడా చకోర పక్షిలా లక్ష్యాన్ని చేరుకునేందుకు అవిశ్రాంతంగా శ్రమించాలని ఈ సినిమా ద్వారా చెబుతున్నాం' అని దర్శకుడు మంగా శ్రీనివాస్ అన్నారు. ఈ సినిమాలో భాగం కావడం పట్ల హీరోహీరోయిన్లు శ్రవణ్, మలైకా ఆనందం వెలిబుచ్చారు. ఇంకా చిత్రబృందం అంతా మాట్లాడారు.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,